# ప్రజాభూమి

Prajabhoomi Telugu Daily

www.prajabhoomi.com


మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం



3


తెలంగాణ ఎడిటర్ : విప్పల చంద్రశేఖర్ | సోమవారం | 28.10.2024 | పేజీలు: 08 | నమూనా సంచిక | వెల : అమూల్యం


## తనిఖీలు ఆపండి

జన్వాడ ఫామ్ హౌస్ పార్టీ వివాదంపై బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆరా తీశారు. డీజీపీ జితేందర్‌కు కేసీఆర్ ఫోన్ చేశారు. కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల, ఆయన సోదరుడు శైలేందర్ ఇళ్లలో తనిఖీల వివరాలను అడిగి తెలుసుకున్నారు. సెర్చ్ వారెంట్ లేకుండా పోలీసులు ఇళ్లలో ఎలా తనిఖీలు చేస్తారని ప్రశ్నించారు. వెంటనే



తనిఖీలు ఆపాలని డీజీపీని కోరారు.

- బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

## రేవ్ పార్టీ కాదు..ఫ్యామిలీ ఫంక్షన్



రాజకీయంగా ఎదుర్కోలేకే మా బంధువులపై కేసులు పెడుతున్నారు. కుట్రలతో మా గొంతు నొక్కుతున్నారు. మా కుటుంబ సభ్యులపై కేసులు బనాయిస్తున్నారు. చిల్లర పనులు, కేసులకు భయపడం. అది ఫామ్‌హౌస్ మా బావమరిది రాజ్ పాకాల ఇల్లు. పార్టీలో చిన్న పిల్లలు కూడా ఉన్నారు. అది ఫ్యామిలీ ఫంక్షన్ మాత్రమే. గృహ ప్రవేశం సందర్భంగా జరిగిన ఫంక్షన్. పార్టీలో ఎలాంటి డ్రగ్స్ దొరకలేదు. దావత్‌లో 13 మందికి నెగిటివ్ వస్తే ఒకరికే పాజిటివ్ వచ్చిందంట. ఆ వ్యక్తి ఎక్కడ డ్రగ్ తీసుకున్నారో విచారించాలి. కాంగ్రెస్, బీజేపీ రెండు పార్టీలు కూడబలుక్కుని మాట్లాడుతున్నాయి. నా బావమరిదికి డ్రగ్ టెస్టులో నెగిటివ్ వచ్చింది.


- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

## కేటీఆర్ డ్రగ్స్ తీసుకుంటూ దొరికినా బుకాయిస్తాడు..



కేటీఆర్ బావమరిది ఫామ్‌హౌస్‌లోనే రేవ్ పార్టీలా అని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు. 'సుద్దపూస.. ఇప్పుడేమంటాడో. బావ మరది ఫామ్ హౌస్‌లోనే రేవ్ పార్టీలా?. డ్రగ్స్ తీసుకుంటూ అడ్డంగా దొరికినా బుకాయిస్తాడేమో. 'సుద్దపూస'ను కావాలనే తప్పించారనే వార్తలొస్తున్నాయి. సమాజాన్ని భ్రష్టు పట్టిస్తున్న డ్రగ్స్‌పై రాజీ ధోరణి ఎందుకు?. కాంగ్రెస్, బీఆర్ఎస్ కాంప్రమైజ్ పాలిటిక్స్ సిగ్గు చేటు. చిత్తశుద్ధి ఉంటే సమగ్ర విచారణ జరపాలి. సీసీ పుటేజీ సహా ఆధారాలు ధ్వంసం కాకుండా చూడాలి. డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపాల్సిందే. బడా నేతలతో సహా రేవ్ పార్టీలో ఉన్న వాళ్లందరినీ అరెస్ట్ చేయాలి. చట్టం ముందు అందరూ సమానమని నిరూపించేలా చర్యలు ఉండాలని' డిమాండ్ చేశారు.

- కేంద్ర మంత్రి బండి సంజయ్



2

### ప్రశాంతంగా ముగిసిన గ్రూప్1 పరీక్షలు

- అక్టోబరు 21 నుంచి 27 వరకు కొనసాగిన ఎగ్జామ్స్
- మొత్తం 513 పోస్టులకు పరీక్షలు జరిపిన టీజీపీఎస్సీ



### కేటీఆర్‌ను ఇరికించాలని సీఎం కొత్త డ్రామా

- హామీలు ఇచ్చి మాట తప్పి డైవర్షన్ పాలిటిక్స్
- పొలిటికల్ ప్రెజర్‌తో కక్ష సాధింపు రాజకీయాలు
- మంత్రి పొంగులేటి చెప్పిన బాంబులు ఇవేనా?
- బీఆర్ఎస్ నేతలు కేపీ వివేకానంద, బాల్క సుమన్

2

# రచ్చ లేపుతున్న రేవ్ పార్టీ

## కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల ఫాంహౌస్‌పై పోలీసుల దాడులు

- డీజే సౌండ్స్‌తో అర్ధరాత్రి లిక్కర్, డ్రగ్స్‌తో పార్టీ నిర్వహణ
- పక్కా సమాచారంతో భగ్నం చేసిన పోలీసులు
- 42 మంది వీఐపీలు ఇందులో పాల్గొన్నట్లు గుర్తింపు
- ఫామ్ హౌజ్‌లో పెద్ద ఎత్తున విదేశీ మద్యం, ఇండియన్ మేడ్ లిక్కర్
- ప్లేయింగ్ కార్డ్స్, పోకర్, క్యాసినో కూడా లభ్యం
- డ్రగ్స్ పార్టీగా అనుమానాలు.. పరీక్షలు చేయగా ఓ వ్యక్తికి పాజిటివ్
- విజయ్‌పై డ్రగ్స్ ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు
- రాజ్ పాకాల సోదరుడు శైలేంద్ర ఇంట్లో ఎక్సైజ్ పోలీసుల సోదాలు
- విదేశీ మద్యం ఉన్నట్లు అనుమానిస్తున్న పోలీసులు
- ఒరియన్ విల్లాస్ వద్ద బీఆర్ఎస్ నేతలు, పోలీసులకు మధ్య ఉద్రిక్తత
- ఎమ్మెల్యే కేపీ వివేకనంద, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ అరెస్ట్

2





# మూసీని జీవనదిగా మారుస్తాం

## అక్కడ నరకం అనుభవిస్తున్న వారి జీవితాల్లో వెలుగునిద్దాం

- ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనేదే మా లక్ష్యం
- హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దుతాం
- సదర్ అంటే.. యాదవుల ఖదర్
- నగరం అభివృద్ధికి వారందరూ ఒక్కటవ్వాలి
- యాదవులకు రాజకీయంగా అవకాశాలు కల్పిస్తాం
- ఇక నుంచి అధికారికంగా సదర్ వేడుకలు నిర్వహిస్తామని ప్రకటన
- ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన సదర్ వేడుకల్లో సీఎం రేవంత్ రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

హైదరాబాద్‌లో సదర్ ఉత్సవాలు నిర్వహించడం రాష్ట్రానికే గర్వకారణమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. నగర అభివృద్ధిలో యాదవ సోదరుల పాత్ర కాదనలేనిదని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో

మిగతా 2లో..



2

### సస్పెన్షన్ ఎత్తేయండి

- ఆ 39 మంది కానిస్టేబుళ్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలి
- రాష్ట్రవ్యాప్తంగా బెటాలియన్ పోలీసుల నిరసన
- సర్కార్ కు వ్యతరేకంగా నినాదాలు



### 4 డీఏలకు ఒక డీఏ ఎట్టిస్తరు

- మూడేళ్ల తర్వాత రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లిస్తాననడం దుర్మార్గం
- ఆ 39 మంది కానిస్టేబుళ్లపై తక్షణమే సస్పెన్షన్ ఎత్తివేయాలి
- ప్రభుత్వానికి మాజీ

2



2

### పోలీస్ కుటుంబాలపై నిర్బంధం ఆపాలి

- రాష్ట్రంలో ఆర్డర్లీ వ్యవస్థ కొనసాగుతున్నది
- వెట్టి చాకిరీ చేస్తున్నా బెనిఫిట్స్ ఇవ్వడం లేదు
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం

## రేవంత్‌కు ప్రభుత్వాన్ని నడుపోస్తలేదు

పది నెలలవుతోంది ఒక్క పథకం అమలు కాలే..

- రుణమాఫీ, రైతుబంధుకు పైసలు లేవ్వా.. మూసీ ప్రక్షాళనకు ఉన్నాయా?
- ఆ పేరుతో ఢిల్లీకి మూటలు పంపేందుకు దొంగ జపం
- సుందరీకరణకు మేం వ్యతిరేకం కాదు.. లూటిఫికేషన్‌కే వ్యతిరేకం
- నాచారంలో సీవరేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలనలో కేటీఆర్ కామెంట్స్

2





### రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు చూస్తున్నా

- జన్వాడలో పార్టీ జరిగితే.. రాజ్ పాకాల ఇంట్లో సోదాలు చేస్తారా?
- కేటీఆర్ ఎదుగుదల ఓర్వలేకే ఇలాంటి చర్యలు
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

2



2

### మూసీ ప్రక్షాళనకు అండగా ఉండాలి

- ఎంపీ చామల, ఎమ్మెల్యేలు సామేల్, వేముల వీరేశం

మిగతా 2లో..

## ఆర్థిక పరిస్థితిపై శ్వేతప్రతం రిలీజ్ చేయాలి

- కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాలు అవస్థలు పడుతున్నయ్
- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగలేదంటూనే.. మూసీకి లక్షన్నర కోట్లా?
- ఆ డబ్బులు ఎక్కడి నుంచి తెస్తున్నారో చెప్పాలి
- గత ప్రభుత్వ స్కీమ్‌లు ఉన్నాయా?.. ఎత్తేశారా?
- సర్కార్‌ను ప్రశ్నించిన కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణ ఆర్థిక పరిస్థితిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని కేంద్ర మంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు కిషన్ రెడ్డి అన్నారు. ప్రజల ఆశలు, ఆకాంక్షలను కాంగ్రెస్ ప్రభుత్వం వమ్ము చేస్తోందని విమర్శించారు. ఆదివారం

మిగతా 2లో..



### సీఎం నీచ రాజకీయాలకు పరాకాష్ట

సీఎం రేవంత్‌కు దాసోజు శ్రవణ్ హితవు

2

# రచ్చ లేపుతున్న రేవ్ పార్టీ

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

జన్వాడ ఫాంహౌజ్‌లో రేవ్ పార్టీ ఘటన రాష్ట్ర రాజకీయాలను షేక్ చేస్తోంది. రేవ్ పార్టీ జరిగిన బిల్డింగ్ కేటీఆర్ బావమరిది కావడంతో సంచలనంగా మారింది. శనివారం రాత్రి జన్వాడలోని ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ నిర్వహించారు. భారీ శబ్దం చేస్తూ పార్టీ నిర్వహిస్తున్నారని పోలీసులు సమాచారం అందింది. డయల్ 100కు ఫోన్ చేసి డ్రగ్స్ పార్టీపై సమాచారం రావడంతో పోలీసులు, సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు వెంటనే అక్కడికి చేరుకుని డ్రగ్స్ పార్టీని అడ్డుకున్నారు. ఈ పార్టీలో పాల్గొన్న 24 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించారు. వారిలో విజయ్ మద్దూరి అనే వ్యక్తికి పాజిటివ్‌గా తేలింది. కొకైన్ తీసుకున్నట్లు పరీక్షలో తేలడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. పార్టీలో భారీగా విదేశీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. పార్టీలో పాల్గొన్న వారిలో 14 మంది మహిళలు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. దాదాపు 30 ఎకరాల్లో ఈ ఫాంహౌస్ ఉంది. డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న ఒక వ్యక్తికి కొకైన్ డ్రగ్ పాజిటివ్‌గా తేలినట్లు సమాచారం. డ్రగ్స్ తీసుకున్నట్లు మరికొందరికీ సైతం టెస్టుల్లో పాజిటివ్‌గా రావడం కలకలం రేపుతోంది. పార్టీలో పాల్గొన్న వారు కొకైన్ తీసుకున్నట్లు డ్రగ్ టెస్ట్‌లో తేలడంతో ఎన్డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. ముందస్తు అనుమతి లేకుండా రాజ్ పాకాల ఫామ్ హౌస్‌లో డ్రగ్స్ పార్టీపై ఎన్డీపీఎస్ యాక్ట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఆ పార్టీలో డ్రగ్స్, విదేశీ మద్యం వినియోగించినట్లు గుర్తించారు. 10 లీటర్లకు పైగా అనుమతి లేని విదేశీ మద్యం, ఇండియన్ మేడ్ లిక్కర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ప్లేయింగ్ కార్డ్స్, పోకర్, క్యాసినో వంటి వాటిని గుర్తించారు. ఫామ్ హౌస్‌లో దొరికిన ఫారిన్ బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులకు అప్పగించారు. సెక్షన్ 34, ఎక్సైజ్ యాక్ట్ కింద మరో కేసు సైతం నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

**విచారణకు హాజరు కాని రాజ్ పాకాల...**

జన్వాడ ఫామ్ హౌస్ కేసు దర్యాప్తులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. విజయ్ మద్దూరిని పోలీసులు విచారిస్తున్నారు. పోలీసుల విచారణలో పలు కీలక విషయాలను విజయ్ మద్దూరి వెల్లడించారు. రాజ్ పాకాల వద్ద నుంచే కొకైన్ తీసుకుని తాను సేవించినట్లు విజయ్ మద్దూరి అంగీకరించాడు. మోకిలా పోలీసులకు విజయ్ స్టేట్మెంట్ ఇచ్చాడు. ఈ కేసులో విజయ్ స్టేట్మెంట్ కీలకంగా మారింది. రాజ్ పాకాలకు కొకైన్ ఎలా వచ్చింది. ఎవరు వద్ద నుంచి వచ్చింది. కొకైన్ ఎవరు విక్రయించారు. ఆ పార్టీలో ఎవరెవరు పాల్గొన్నారని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. రెండు చోట్ల విచారణకు రాజ్ పాకాల హాజరు కాలేదు. ఆదివారం ఉదయం 10 గంటలకు ఎక్సైజ్ కార్యాలయం, 2 గంటలకు మోకిలా పోలీస్ స్టేషన్ విచారణకు రాజ్ పాకాల డుమ్మా కొట్టారు. మొబైల్ స్విచ్ఛాఫ్ చేసుకుని రాజ్ పాకాల అందుబాటులోకి రాలేదు. 24 గంటలు చూసి వారెంట్ జారీ చేస్తామని మోకిలా పోలీసులు చెబుతున్నారు. నార్కోటిక్ కేసులో ఏ1గా రాజ్ పాకాల, ఏ2గా విజయ్ మద్దూరిని ఎఫ్ఐఆర్‌లో మోకిలా పోలీసులు చేర్చారు. ఎస్ఐ కోటేశ్వ రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు మోకిలా పీఎస్‌లో కేసు నమోదు చేశారు. రాజ్ పాకాల కంపెనీలో సీఈవోగా విజయ్ మద్దూరి పనిచేస్తున్నారు. నూతన ఫామ్‌హౌస్‌లో దీపావళి పార్టీ కోసం రాజ్ పాకాల పిలిచాడని విజయ్ తెలిపారు. కొకైన్ తీసుకోవాలని చెప్పాడని పోలీసులకు విజయ్ తెలిపారు. వీకెండ్‌లో తరచూ రాజ్ పాకాల పార్టీలు నిర్వహించేవారని, వీకెండ్స్‌లో రాజ్ పాకాల, విజయ్ మద్దూరి ఇద్దరు కలిసి డ్రగ్స్ పార్టీలు చేసుకునేవారని మోకిలా పోలీసులు వెల్లడించారు.

**విల్లా దగ్గర ఉద్రిక్తత.. బీఆర్ఎస్ నేతలు అరెస్ట్...**

రాజ్ పాకాల సోదరుడు శైలేంద్ర పాకల ఫామ్‌హౌస్ వద్ద బీఆర్ఎస్ నేతలు ఆదివారం ఆందోళన చేపట్టారు. దీంతో విల్లా దగ్గర తీవ్ర ఉద్రిక్తత చోటుచేసుకుంది. జాయింట్ కమిషనర్ ఎక్సైజ్ ఖురేషి నేతృత్వంలో సోదాలు నిర్వహించడానికి వచ్చారు. అయితే ఎక్సైజ్ శాఖ సోదాలను బీఆర్ఎస్ నేతలు అడ్డుకున్నారు. ఎమ్మెల్యే మాగంటి గోపినాథ్, ఎమ్మెల్యే వివేక్, బాల్క సుమన్, సంజయ్‌తో పాటు బీఆర్ఎస్ కార్యకర్తలు భారీగా విల్లా వద్దకు చేరుకున్నారు. విధుల్లో ఉన్న పోలీసులను అడ్డుకోవద్దని ఎక్సైజ్ పోలీసులు నచ్చజెప్పారు అయినా వినకపోవడంతో వారిని అడ్డుకున్నారు. సెర్చ్ వారెంట్ చూపాలని ఎక్సైజ్ పోలీసులతో బీఆర్ఎస్ కార్యకర్తలు వాగ్వాదానికి దిగారు. తమ న్యాయవాది సమక్షంలో సెర్చ్ చేయాలని బీఆర్ఎస్ నేతలు వాదనలు వినిపించారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్ఎస్ నేతల మధ్య తీవ్ర వాగ్వాదం చోటు చేసుకుంది. దీంతో బీఆర్ఎస్ నేతలు వివేకానంద, బాల్క సుమన్ సహా పలువురు నేతలను పోలీసులు అరెస్ట్ చేశారు.





**సోదాలపై స్పందించిన కేసీఆర్, హరీశ్ రావు...**

రేవ్ పార్టీ కేసుకు సంబంధించి మాజీ సీఎం కేసీఆర్ స్పందించారు. ఈ కేసుకు సంబంధించిన విషయాల గురించి స్వయంగా రాష్ట్ర డీజీపీకి కేసీఆర్ ఫోన్ చేసి ఆరా తీశారు. సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎందుకు చేస్తున్నారని, వెంటనే సోదాలను ఆపాలని డిమాండ్ చేశారు. అలాగే రాజ్ పాకాల, అతని సోదరుడు శైలేంద్ర గృహాలలో సోదాలను నిర్వహిస్తున్న తీరుపై కేసీఆర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే రేవ్ పార్టీ కేసుపై మాజీ మంత్రి హరీష్ రావు కూడా స్పందించారు. బీఆర్ఎస్ పార్టీని, కేటీఆర్ ను ఎదుర్కోలేక, తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం చౌకబారు రాజకీయాలకు పాల్పడుతుందన్నారు. వ్యక్తులు తమ ప్రత్యర్థులను నేరుగా ఎదుర్కోలేనప్పుడు, వారు తరచుగా వారి కుటుంబాలను లక్ష్యంగా చేసుకుంటారన్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, పార్టీ క్యాడర్‌ను అక్రమంగా అరెస్టు చేయడంతో సహా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రతీకార రాజకీయాలు, ఫిరాయింపు వ్యూహాలను తాను ఖండిస్తున్నట్లు తన ఎక్స్ ఖాతా ద్వారా హరీష్ రావు స్పందించారు.



# మూసీని జీవనదిగా మారుస్తాం

(మొదటి పేజీ తరువాయి)

నిర్వహించిన సదర్ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇక నుంచి ప్రతీ ఏటా సదర్ సమ్మేళనాన్ని ప్రభుత్వమే అధికారికంగా నిర్వహించనున్నట్టు ప్రకటించారు. సదర్ అంటే యాదవుల ఖదర్ అని.. సదర్ సమ్మేళనాన్ని ప్రతి గ్రామానికి తీసుకెళ్లాలని తెలిపారు. యాదవులు రాజకీయంగా ఎదగాలని సీఎం రేవంత్ రెడ్డి ఆకాంక్షించారు. యాదవులకు రాజకీయంగా మరిన్ని అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. కృష్ణుడు ఆరోజు పాండవుల పక్షాన నిలబడి ధర్మాన్ని నిలబెట్టారని.. ఆయనను నమ్ముకునే యాదవులు సైతం ధర్మం వైపు నిలబడుతారని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. అనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్‌లో అంజన్ కుమార్ యాదవ్‌ను గెలిపించి ఉంటే.. ఈరోజు మంచి మంత్రి అయ్యేవారని గుర్తు చేశారు. ఆయనను గెలిపించకపోయినప్పటికీ.. యాదవుల ప్రాధాన్యత ఉండాలని ఆయన కుమారుడు అనిల్ కుమార్ యాదవ్‌ను రాజ్యసభకు పంపించామని గుర్తు చేశారు.

**అంజన్న తడబడ్డా.. అనిల్‌కు అవకాశమిచ్చాం..**

హైదరాబాద్‌ను అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. మూసీ ప్రాంతాన్ని పునరుద్ధరణ చేసి.. అక్కడ అన్ని విధాల అభివృద్ధి చేస్తామని ప్రకటించారు. మూసీలో నరకాన్ని అనుభవిస్తున్న ప్రతి పేదవాడి జీవితంలో వెలుగులు నింపుతామన్నారు. అక్కడి ప్రజలకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలనేది ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. హైదరాబాద్‌లోని మూసీ పరివాహక ప్రాంతాల్లో యాదవులు పశుగ్రాసాన్ని పెంచుకుని.. పశుసంపదను అభివృద్ధి చేసేవారని తెలిపారు. హెరిటేజ్, విజయ డైయిరీ లాంటి సంస్థలు వచ్చాయి కానీ.. ఆనాడు పాల దందా అంటే యాదవులదేనని గుర్తు చేశారు. ఏ సందర్భమొచ్చినా.. ఏ అవకాశం వచ్చినా.. యాదవులంతా ఏకమవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. నగరం అభివృద్ధి చేసేందుకు యాదవులు అండగా నిలబడాలని పిలుపునిచ్చారు. మూసీ నిర్వాసితులకు అండగా నిలవటంతో బాటు దానిని జీవనదిగా మార్చుతామన్నారు. ఈ కార్యక్రమంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రి పొన్నం ప్రభాకర్, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, సింగర్ రాహుల్ సిప్లిగంజ్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన గ్రూప్1 పరీక్షలు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

తెలంగాణలో వారం రోజుల పాటు జరిగిన గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. అక్టోబరు 21 నుంచి ప్రారంభమైన పరీక్షలు అక్టోబర్ 27వ తేదీ ఆదివారం సాయంత్రం 5గంటలతో పూర్తయ్యాయి. మొత్తం 513 పోస్టులకు గ్రూప్1 నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. 31,383 మంది అభ్యర్థులు మెయిన్స్‌కు అర్హత సాధించగా.. వీరిలో అత్యధికులు పరీక్షలకు హాజరయ్యారు. స్పోర్ట్స్ కేటగిరిలో 20 మందిని అదనంగా పరీక్షలకు అనుమతించారు. గ్రూప్ 1 మెయిన్స్ పరీక్షల నిర్వహణ కోసం హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాల్లో 46 పరీక్షా కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. అయితే గ్రూప్ 1 మెయిన్స్‌కు అర్హత సాధించిన వారిలో చాలా మంది పరీక్షలకు గైర్హాజరు అయ్యారు. దీంతో ఉద్యోగాల కోసం పోటీ పడే అభ్యర్థుల సంఖ్య తగ్గింది. ఇక ఈ నెల 25న నిర్వహించిన పేపర్ 4 ఎకానమీ అండ్ డెవలప్‌మెంట్ పరీక్షలో ఓ మహిళా అభ్యర్థి కాపీయింగ్‌కు పాల్పడ్డారు. రంగారెడ్డి జిల్లా సీవీఆర్ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన మహబూబ్‌నగర్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన లక్ష్మి చిట్టీలు తీసుకుని వచ్చి కాపీయింగ్‌కు పాల్పడేందుకు యత్నించింది. ఇది గుర్తించిన సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఆమెను డిబార్ చేస్తున్నట్టుగా టీజీపీఎస్సీ ప్రకటించింది. 26న పేపర్ 5 రోజున కూడా మరో అభ్యర్థి కాపీయింగ్‌కు పాల్పడేందుకు యత్నించాడు. నారాయణమ్మ ఇంజనీరింగ్ కాలేజ్‌లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చిన ఓ అభ్యర్థిని తనిఖీ చేయగా అతని వద్ద చిట్టీలు కనిపించాయి. దీంతో అతడిపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని టీజీపీఎస్సీ తెలిపింది.

# 4 డీఏలకు ఒక డీఏ ఎట్లిస్తరు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

బెటాలియన్ కానిస్టేబుళ్లపై సస్పెన్షన్‌ను ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. ఇప్పటికే ఉన్న నిబంధనలను ఆకస్మికంగా సవరించినప్పుడు స్పెషల్ పోలీసుల నిజమైన అభ్యర్థనలను పరిగణనలోకి తీసుకోనప్పుడు ఆందోళనకు గురైన వారి కుటుంబ సభ్యులను సహచర పోలీసులే అరెస్ట్ చేసినప్పుడు, పోలీసులు ఏమి చేయాలని ప్రశ్నించారు. గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని బెటాలియన్ పోలీసుల కుటుంబ సభ్యులు, కానిస్టేబుళ్లు ఆందోళనలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. బెటాలియన్లలో ఆందోళనలు నిర్వహించిన కానిస్టేబుళ్లపై ప్రభుత్వం శాఖాపరమైన చర్యలు తీసుకున్నది. క్షమశిక్షణా రాహిత్యంగా పరిగణిస్తూ 39 మంది కానిస్టేబుళ్లను సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో వారిపై సస్పెన్షన్ ఎత్తివేసి తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని హరీశ్ రావు డీజీపీని కోరారు. మానవతా దృక్పథంతో వారి సస్పెన్షన్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు.

**రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను విడుదల చేయాలి...**


అలాగే కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు. పదవీ విరమణ పొందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మన్మోహన్ వీడ్కోలు కార్యక్రమంలో హరీష్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రిటైర్డ్ అయిన 6 వేల మంది ఉద్యోగుల రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వడం లేదని, ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ 3 సంవత్సరాల తర్వాత చెల్లిస్తాం అనడం దుర్మార్గమని, 4 డీఏలకు ఒక డీఏ మాత్రమే ప్రకటించి ప్రభుత్వ ఉద్యోగులను నిరాశపరిచింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యోగులకు ఇవ్వాల్సిన రిటైర్మెంట్ బెనిఫిట్స్‌ను వెంటనే విడుదల చేయాలని హరీశ్ రావు డిమాండ్ చేశారు.



# రాజకీయాల్లో వ్యక్తిగత కక్షలు చూస్తున్నా

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

జన్వాడ ఫామ్‌హౌస్‌లో సైబరాబాద్ ఎస్వోటీ పోలీసులు దాడులు నిర్వహించి 21 మంది పురుషులు, 14 మంది మహిళలను అదుపులోకి తీసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాయదుర్గంలోని ఓరియన్ విల్లాస్‌లో పోలీసులు సోదాలు నిర్వహించారు. దీనిపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. జన్వాడ ఫామ్‌హౌజ్‌కు ఓరియన్ విల్లాస్‌కు సంబంధమేంటని ప్రశ్నించారు. పార్టీ జరిగిన ప్రదేశం వదిలేసి గేటెడ్ కమ్యూనిటీలో ఎలా తనిఖీలు నిర్వహిస్తారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, సబితా ఇంద్రారెడ్డి తదితరులు మాట్లాడారు. 'కేటీఆర్ బావమరిది రాజ్ పాకాల జన్వాడలో సొంతిల్లు కట్టుకొని గృహప్రవేశం చేశారు. వారి కుటుంబ సభ్యులంతా అక్కడ కలుసుకున్నారు. పోలీసులు మాత్రం అక్కడ సీన్ మొత్తం మార్చారు. కేటీఆర్ ఎదుగుదల ఓర్వలేకే ఇలాంటి చర్యలకు దిగుతున్నారు. అక్కడ కేవలం 4 బాటిళ్లు మాత్రమే ఉన్నాయి. దీనికి అంత రాద్ధాంతం చేయాల్సిన అవసరం ఏముంది? నాలుగు బాటిళ్లు ఎక్కువగా ఉన్నాయని కేసు నమోదు చేస్తామన్నారు. అంతవరకు బాగానే ఉంది. డ్రగ్స్, క్యాసినో ఇవన్నీ తెరమీదకు ఎందుకు తీసుకొస్తున్నారు? జన్వాడ ఎక్కడుంది. గేటెడ్ కమ్యూనిటీలోని రాజ్ పాకాల ఇల్లు ఎక్కడుంది. అక్కడ పార్టీలు జరిగితే.. ఇక్కడ సోదాలు చేయడమేంటి? రాజకీయాల్లో విమర్శ, ప్రతి విమర్శలు ఉంటాయి. కానీ, వ్యక్తిగతమైన కక్షలు రాజకీయాల్లో మొదటిసారి చూస్తున్నా. సెర్చ్ వారెంట్ లేకుండా బలవంతంగా ఇంట్లోకి వెళ్లడం ఏంటి? ప్రజాస్వామ్యం అంటే ఇదేనా? కచ్చితంగా దీనిపై న్యాయ పోరాటం చేస్తాం. ఇలాంటి ఉద్దేశ పూర్వక కుట్రలకు స్వస్తిపలకాలి' అని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు.



# ఆర్థిక పరిస్థితిపై శ్వేతప్రత్రం రిలీజ్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)

బీజేపీ స్టేట్ ఆఫీస్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వ పది నెలల పాలన చూశాక అన్ని వర్గాల ప్రజలు మోసపోయామని భావిస్తున్నారని చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చడం లేదని మండిపడ్డారు. పెన్షన్లను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి ఇంతవరకు పెంచలేదు. యువతకు నిరుద్యోగ భృతి గురించి ఇంకా సీఎం ఆలోచించడం లేదు. రైతుబంధు ఇవ్వడం లేదు. రైతుబంధు ఉందో, లేదో తెలియదని ఎద్దేవా చేశారు. "రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగులేదంటారు మూసీ ప్రాజెక్టు లక్షన్నర కోట్లు అంటారు?.. మూసీలో ఎన్ని భూములు అమ్ముతున్నారు?. ఎలాంటి ప్రణాళిక ఉంది?. లక్షన్నర కోట్లు ఎక్కడి నుంచి తెస్తున్నారో చెప్పాలి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అప్పులెంత?. గత ప్రభుత్వ స్కీమ్‌లు ఉన్నాయా?.. ఎత్తేశారా?. అసలు రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ఏంటో స్పష్టం చేయాలి" కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. జన్వాడ ఫామ్‌హౌస్‌లో రేవ్ పార్టీ జరిగిందో లేదో సమగ్రంగా విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఎవరి ఫామ్‌హౌస్ అయిన సీఎం బంధువు అయినా, మాజీ ముఖ్యమంత్రి బంధువు అయినా దర్యాప్తు జరపాలని, ఈ వ్యవహారంపై బీజేపీ స్టాండ్ ఇదేనని స్పష్టం చేశారు. మద్యం పర్మిషన్ లేకుండా లిక్కర్ సరఫరా చేశారని పోలీసులు చెప్పినట్లు స్మోకింగ్ వస్తుందని తెలిపారు. డ్రగ్స్‌పై పూర్తి స్థాయిలో విచారణ కొనసాగాలని, చట్టం తన పని తాను చేసుకోవాలని కోరారు.

# కేటీఆర్‌ను ఇరికించాలని సీఎం కొత్త డ్రామా

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

సీఎం రేవంత్ రెడ్డి మరో కొత్త నాటకానికి తెర దీశారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద విమర్శలు చేశారు. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఇరికించాలని సీఎం ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. హామీలు ఇచ్చి మాట తప్పి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్వలేక ఆరోపణలు చేస్తున్నారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. కేటీఆర్ బావమరిది సొంత ఇంట్లో కుటుంబ సభ్యులతో పార్టీ ఏర్పాటు చేసుకున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి పాలనను గాలికి వదిలేశారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డికి కేటీఆర్ సిండ్రోమ్, ఫోబియా పట్టుకుందని విమర్శించారు. స్వయంగా రాజ్ పాకాల ఇంటికి పోలీసులు, ఆబ్కారీ అధికారులు వెళ్లి సెర్చ్ చేశారని అన్నారు. ఎలాంటి సెర్చ్ వారెంట్ లేకుండా రాజ్ పాకాల కుటుంబ సభ్యులను పోలీసులు ఇబ్బంది పెట్టారని ఎమ్మెల్యే కేపీ వివేకానంద చెప్పారు.

**వాటిని పక్కదారి పట్టించేందుకే ఈ దాడులు...**

నోటీసులు లేకుండా రాజ్ పాకాల ఇంట్లోకి పోలీసులు ఎలా వస్తారని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ప్రశ్నించారు. మాజీ మంత్రి కేటీఆర్ ఇంటి వద్దకు ఎక్సైజ్ జాయింట్ కమిషనర్ ఎలా వస్తారని నిలదీశారు. పొలిటికల్ ప్రెజర్‌తో రేవంత్ రెడ్డి కక్ష సాధింపు రాజకీయాలు చేపడుతున్నారని మండిపడ్డారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి దీపావళి ముందు పొలిటికల్ బాంబులు పేలుతాయని అన్నారని, అవి ఈ బాంబులేనా అని బాల్క సుమన్ ఎద్దేవా చేశారు. రైతులందరికీ రుణమాఫీ ఎందుకు చేయడం లేదని నిలదీశారు. మూసీ పరివాహక బాధితులను ఇబ్బందులకు గురిచేశారని ధ్వజమెత్తారు. వాటిని పక్కదారి పట్టించేందుకే ఈ దాడులు చేస్తున్నారని ఆరోపించారు.

# రేవంత్‌కు ప్రభుత్వాన్ని నడుపోస్తలేదు

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

సీఎం రేవంత్ రెడ్డికి ప్రభుత్వాన్ని నడపటం వస్తలేదని, దేశంలో ఎక్కడా లేని విధంగా పోలీసులను పోలీసులే కొడుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. ఈ అంశంలో రేవంత్ రెడ్డి రికార్డు సాధించారని అన్నారు. ఆదివారం కేటీఆర్ సిటీ పార్టీ ఎమ్మెల్యేలతో కలసి నాచారం ఎస్టీపీని పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కనపెట్టి మూసీకి రూ. లక్షన్నర కోట్లు ఖర్చు పెడతామని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చెబుతోందని, మూసీ సుందరీకరణ కేవలం 1100 కోట్ల రూపాయలతో గోదావరి నీళ్లు మూసీకి తీసుకువస్తే పూర్తి అవుతుందన్నారు. కానీ ఈ ప్రభుత్వం లక్షన్నర కోట్ల రూపాయలు చెప్పి అవినీతి కోసం కుట్ర చేస్తుందని విమర్శించారు. ముఖ్యమంత్రి చెప్పిన లక్షన్నర కోట్ల మాట తాను అంటే తనపై ప్రభుత్వం కేసు పెట్టిందని, వంద రోజుల్లో పూర్తి చేస్తామన్న హామీలు, గ్యారంటీలను సీఎం రేవంత్ రెడ్డి మరిచిపోయారని కేటీఆర్ ఆరోపించారు. మూసీ ప్రాజెక్టు వెనుక ఉన్న మూటల గురించి మాట్లాడుతున్నారని అన్నారు. తమ పార్టీ మూసీకి వ్యతిరేకం కాదని.. కానీ మూసీ ప్రాజెక్టు పేరు చెప్పి లక్షన్నర కోట్ల రూపాయల అవినీతి చేస్తామంటే ఊరుకోమని అన్నారు. హైదరాబాద్ నగరంలో రిజిస్ట్రేషన్ పూర్తి అయి అనుమతులు ఉండి పన్నులు కడుతున్న వారి ఇళ్లను కూలగొడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

**హైదరాబాద్ ప్రజలపై అందుకే కక్ష కట్టిండు...**

హైదరాబాద్ నగర ప్రజలు కాంగ్రెస్‌కు ఓటు వేయలేరన్న కక్షతోనే సీఎం రేవంత్ రెడ్డి ఈ విధ్వంసం చేస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. పేద ప్రజల ఇండ్లు కూలగొట్టి షాపింగ్ మాల్స్ కట్టేందుకు ముఖ్యమంత్రి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. 10 సంవత్సరాల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అద్భుతమైన అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి పూర్తి చేసుకున్నామన్నారు. 24 గంటల విద్యుత్తు నిరంతరంగా సరఫరా చేయడంతో పాటు తాగునీటి కోసం కష్టాలు లేకుండా చేశామని, హైదరాబాద్ నగరం రూపురేఖలు మార్చేల అన్ని రంగాల్లో అభివృద్ధిని చేపట్టామని చెప్పారు. హైదరాబాద్ నగర మురికి నీటి శుద్ధీకరణ కోసం అనేక కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. మూసీ నదిలో మురికినీరు రాకుండా ఎస్టీపీల నిర్మాణం చేపట్టామని, 3,866 కోట్ల రూపాయలతో ఎస్టీపీ నిర్మాణం మనం చేపడితే మొన్న ముఖ్యమంత్రి వచ్చి ఉప్పల్లో ప్లాంట్ ప్రారంభించారన్నారు. మూసి పునర్జీవనం అని కాంగ్రెస్ పార్టీ చెబుతుందని, కానీ 4,000 కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి కేసీఆర్ ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని దాదాపు పూర్తి చేసిందన్నారు.

# మూసీ ప్రక్షాళనకు అండగా ఉండాలి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ఉమ్మడి నల్గొండ జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ పరిధిలోని గురజాల మానాయకుంట మూసీ బ్రిడ్జి వద్ద ఆదివారం తుంగతుర్తి నియోజకవర్గ స్థాయి మూసీ రైతుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమరంలో భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేలు, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. మూసీ మురికి నుంచి ప్రజలను కాపాడాలనేదే ప్రభుత్వ లక్ష్యమని వారు చెప్పారు. మూసీ ప్రక్షాళనను సీఎం రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్నరని.. మూసీ ప్రక్షాళనకు రైతులు అండగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు మంచి చేయాలి మురికి కూపంలో బతుకుతున్న ప్రజలకు దారి చూపాలన్న ఆలోచనతో మూసీ ప్రక్షాళనను చెపట్టనున్నట్లు చెప్పారు. అనంతరం వేముల వీరేశం మాట్లాడుతూ.. కమిషన్ లు తినే అలవాటు బీఆర్ఎస్ నేతలది అని, తమకు లేదన్నారు. మంచి పని చేసేపుడు మంచి మాట్లాడాలి కాని.. చిల్లర మాటలు, చిల్లర చేష్టలు చేయవద్దని హెచ్చరించారు. "కాలుష్యం వల్ల పండించే పంట అమ్ముకునే పరిస్థితి లేదు. సమస్యలు పరిష్కారం దిశగా సీఎం ముందుకు వెళుతున్నారు" అని సామేల్ అన్నారు.

# పోలీస్ కుటుంబాలపై నిర్బంధం ఆపాలి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

స్పెషల్ బెటాలియన్ పోలీసుల న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని, పోరాడుతున్న కుటుంబాల మీద నిర్బంధం ఆపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. బెటాలియన్ కానిస్టేబుల్స్ పనిభారాన్ని పెంచుతూ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. రికార్డు పర్మిషన్‌కు సంబంధించిన జీవోను తక్షణమే ఉపసంహరించాలని, పక్క రాష్ట్రాలు అమలు చేస్తున్న విధంగానే ఒకే పోలీస్ విధానం వుండాలని కోరుతున్నారని వెల్లడించారు. ఈ జీవో వల్ల పనిభారం పెరుగుతోందని, ఒత్తిడికి గురవుతున్నామని, నిరంతరాయంగా 26 రోజులు పని చేయాల్సి వస్తోందని, కుటుంబానికి దాదాపు నెల రోజులు దూరంగా ఉంటున్నామని వారు వాపోతున్నారని వివరించారు. దీని ఫలితంగా ఇటీవల కాలంలో కొందరు కానిస్టేబుల్స్ ఆత్మహత్యలు చేసుకున్న ఘటనలు కూడా జరిగాయని ఆరోపించారు. వెట్టి చాకిరీ చేస్తున్నా ప్రభుత్వం అదనపు బెనిఫిట్స్ కూడా ఇవ్వడం లేదన్నారు. వారి పని గౌరవప్రదంగా లేదన్నారు. ఒక విధంగా ఆర్డర్లీ వ్యవస్థ కొనసాగుతున్నదని పేర్కొన్నారు.

# సీఎం నీచ రాజకీయాలకు పరాకాష్ట

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

కొండను తవ్వితే సీఎం రేవంత్ రెడ్డికి చివరకు ఎలుక కూడా దొరుకలేదు అని బీఆర్ఎస్ సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ అన్నారు. రాజ్ పాకాల తన కుటుంబసభ్యులు, బంధుమిత్రులతో కలిసి విందు చేసుకుంటుంటే, 300 మంది పోలీసులతో వాళ్ల ఇంటిపై దాడి చేసి, ఆ విందును రేవ్ పార్టీగా చిత్రీకరించడం, వాళ్లుంటున్న ఇంటిని ఫామ్‌హౌస్‌గా చూపించడం, పైగా ఆ విందును కేటీఆర్‌కు అంటగట్టడం రేవంత్ రెడ్డి నీచ రాజకీయాలకు పరాకాష్ట అని మండిపడ్డారు. డ్రగ్స్ అంటూ, రేవ్ పార్టీ అంటూ తప్పుడు ప్రచారం చేస్తూ, ప్రజా సమస్యలను అలాగే ప్రభుత్వ అవినీతిని మరుగున పెట్టేందుకు చిల్లర ప్రయత్నం చేస్తున్నారని సీఎం రేవంత్ రెడ్డిపై దాసోజు శ్రవణ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతిపక్ష నాయకుల కుటుంబసభ్యులను, వాళ్ల వ్యక్తిగత జీవితాలను రాజకీయాల్లోకి లాగుతూ, ముఖ్యమంత్రి హోదాను కించపరుస్తున్నారని మండిపడ్డారు. ఇవే ప్రభుత్వ ప్రాధాన్యతలు అన్నట్లుగా రేవంత్ రెడ్డి వ్యవహరిస్తుండటం ఆయన కురుచ మనస్తత్వానికి, ఆయన నమ్ముకున్న చిల్లర రాజకీయాలకు నిదర్శనమని విమర్శించారు. సందట్లో సడేమియా లెక్క కొంతమంది కేంద్రమంత్రులు, పార్లమెంటు సభ్యులు అవివేకంతో కేటీఆర్, ఆయన కుటుంబసభ్యులపై పనికి రాని ఆరోపణలు చేస్తున్నారని దాసోజు శ్రవణ్ అన్నారు. పనికిరాని ఆరోపణలు చేస్తూ శునకానందం పొందుతున్నారని విమర్శించారు. చేతనైతే ప్రజా సమస్యలపై పోరాడండి.. కానీ కుటుంబసభ్యులను వీధుల్లోకి లాగి శిఖండి రాజకీయాలు చేయొద్దని హితవు పలికారు.

# సస్పెన్షన్ ఎత్తేయండి

**ప్రజాభూమి ప్రతినిధి, హైదరాబాద్:**

ఒకే రాష్ట్రంఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళన చేసిన టీజీఎస్పీ కానిస్టేబుళ్ళను సస్పెండ్ చేయడంపై బెటాలియన్ కానిస్టేబుల్స్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సస్పెండ్ చేసిన వారిని వెంటనే విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఆదివారం ఆందోళన బాటపట్టారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్ని బెటాలియన్లలో నిరసనలు చేపట్టారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. నల్గొండలోని 12 బెటాలియన్‌లో కానిస్టేబుళ్ల ఆందోళనలు కొనసాగుతున్నాయి. శాంతియుతంగా ధర్నా చేస్తున్న కానిస్టేబుళ్లను అకారణంగా సస్పెండ్ చేశారని తక్షణమే వారిని విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే తమను కూడా సస్పెండ్ చేయండని ధర్నాకు దిగారు. వరంగల్ జిల్లా మామునూరు 4వ బెటాలియన్‌లోనూ పోలీసులు ఆందోళన నిర్వహించారు. సస్పెన్షన్ ఎత్తివేసి, ఒకే పోలీస్ విధానాన్ని అమలు చేయాలన్నారు. విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో సర్దాపూర్ 17వ బెటాలియన్ కానిస్టేబుళ్లు బెటాలియన్ గేటు వద్ద నిరసన వ్యక్తం చేశారు.





# వాలీబాల్ రాష్ట్ర స్థాయి పోటీలకు వేములవాడ విద్యార్థి ఎంపిక

**ప్రజాభూమి ప్రతినిధి, వేములవాడ:**

వేములవాడ పట్టణంలోని మైనార్టీ గురుకుల పాఠశాలలో చదువుతున్న విద్యార్థి అక్టోబర్19 2024 యూ/17 ఉమ్మడి కరీంనగర్ జిల్లా సుల్తానాబాద్ లోని కాలేజీ గ్రౌండ్లో జరిగిన టోర్నమెంట్ కం సెలక్షన్ లో అత్యంత ప్రతిభ కనపరిచి మొదటి స్థానం సాధించిన రోమాల శ్యాం కుమార్ స్టేట్ లెవల్ వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, పిఈటి అక్కినపల్లి దేవయ్యలు తెలిపారు. ఉపాధ్యాయులు విద్యార్థిని అభినందించారు



# ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అధ్యక్షునిగా నూగురి ప్రభాకర్

**ప్రజాభూమి ప్రతినిది వేములవాడ:**

ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ ఎన్నిక ఆదివారం జరిగింది. గౌరవ అధ్యక్షునిగా సగ్గు శేఖర్, అధ్యక్షునిగా నూగురి ప్రభాకర్, ఉపాధ్యక్షులుగా దమ్మ రాము, కార్యదర్శులుగా గోస్కుల నర్సయ్య, జోగం శేఖర్, ప్రచార కార్యదర్శిగా సుగుణాకర్, క్యాషియర్ గా రాజేష్ లను ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో చందుర్తి, బోయిన్పల్లి, వేములవాడకు చెందిన ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ పాల్గొన్నట్లు పేర్కొన్నారు.



# రాజన్న ఆలయ గోశాలను పరిశీలించిన ఈవో

**ప్రజాభూమి ప్రతినిది వేములవాడ:**

వినోద్ రెడ్డి వేములవాడ రాజన్న ఆలయ ఈఓ కె . వినోద్ రెడ్డి కట్ట కింద గోశాలను పరిశీలించారు కొత్తగా వచ్చిన 6 కోడెలను పరిశీలించారు కోడెల సమర్పించిన భక్తులతో ముచ్చటించగా తనకు కొడుకు పుడితే కోడెలను సమర్పిచుకొంటా మొక్కిన అని కొడుకు పుట్టిండు కాబట్టి మొక్కును తీర్చుకొంటున్న అని తెలియపర్చిండు అని పేర్కొన్నారు. కోడెలను సకాలం లో మేత ను వేయాలి శుభ్రంగా ఉంచాలని ఉద్యోగులకు సూచించారు

# బుద్ధుడి బోధనలు అందరికీ ఆదర్శనీయం

**మంత్రి జూపల్లి కృష్ణారావు**

**ప్రజాభూమి ప్రతినిధి,సికింద్రాబాద్ :**



గౌతమ బుద్ధుడి బోధనలు అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాయని ప్రతి ఒక్కరు ఆచరించవలసిన అవశ్యకత ఉందని మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు ఆదివారం సికింద్రాబాద్ మహేంద్ర హిల్స్ లోని మహా బోధి బుద్ధ విహార్ లో కఠిన చీవర దానోత్సవ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యఅతిథిగా విచ్చేశారు . జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా డా. శివనాగిరెడ్డి పాళీ భాష నుంచి తెలుగులోకి అనువాదించిన బుద్ధ వంశం అనే గ్రంధాన్ని మంత్రి ఆవిష్కరించారు. బుద్ధిస్ట్ సాంస్కృతిక, వారసత్వ ఉత్సవాలు, త్రిపీటిక పఠన వేడుకలు, త్రిపీటికలను తెలుగులో అనువదించడానికి ఆర్థిక సహాయం చేయాలని మహాబోధి బుద్ధ విహార్ భిక్షువులు మంత్రిని కోరగా వెంటనే స్పందించిన ఆయన రూ. 4 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి మాట్లాడుతూ.... సమస్త జీవరాసుల పట్ల ప్రేమ, కరుణ, అహింస, శాంతి, సహనంతో ప్రకృతితో మమేకమై జీవించాలనే మహాబోధి గౌతమ బుద్ధుని జ్ఞానమార్గం నేటి సమాజానికి ఎంతో అవసరమని అన్నారు. తెలంగాణ కేంద్రంగా బుద్ధుని బోధనలను ప్రపంచానికి అందించాలనే దృఢ సంకల్పంతో, కార్యాచరణతో సీయం రేవంత్ రెడ్డి సారధ్యంలోని ప్రజా ప్రభుత్వం ముందుకుసాగుతుందని వెల్లడించారు. వీటితోపాటు, బౌద్ధ సంస్కృతి, వారసత్వ పరిరక్షణకు అంకితమైన మహాబోధి బుద్ధ విహార లాంటి సంస్థలకు ప్రభుత్వం తన వంతు సహకారాన్ని అందిస్తూనే ఉందని, బుద్ధ విహార్ ధ్యాన మందిర నిర్మాణానికి సీయం రేవంత్ రెడ్డి రూ. 2.17 కోట్ల నిధులు కేటాయించిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా గుర్తుచేశారు. కార్యక్రమంలో బౌద్ధ భిక్షువులు భక్తులు పాల్గొన్నారు.

# అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలి..

**నవాబుపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ...**

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:**




:అర్హులైన ప్రతి ఒక్కరూ సీఎం రిలీఫ్ ఫండ్ ను సద్వినియోగం చేసుకోవాలని,అన్ని వర్గాల అభివృద్ధే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిరంతరం పనిచేస్తుందని కాంగ్రెస్ పార్టీ నవాబుపేట గ్రామ శాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.ఆదివారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేటలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు.లబ్ధిదారులైన హనుమాన్ల స్వరూప,పిల్లి రమేష్,సుంకె వెంకటలక్ష్మి లకు చెక్కులను అందజేసినట్లు శ్రీనివాస్ రెడ్డి చెప్పారు.మంత్రి పొన్నం ప్రభాకర్ కు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు ఇనుగాల శ్రీనివాస్ రెడ్డి,మండల ఉపాధ్యక్షుడు నరేందర్ సింగ్,మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఎండి షాబుద్దీన్, సింగిల్ విండో డైరెక్టర్ కూతురు రవీందర్ రెడ్డి,సోషల్ మీడియా కన్వీనర్ బోయిని వేణుగోపాల్,మండల యూత్ నాయకుడు వరుకోలు సంతోష్,తాజా మాజీ సర్పంచ్ సుద్దాల ప్రవీణ్,గూళ్ల కనకయ్య,బరిగెల వెంకటేశం, కంది వేణు,మేకల రాజేందర్,మాంకాల రవి,తౌడు మల్లేశం,గుళ్ల మొండి,దామ శ్రీనివాస్,సారయ్య,రవీ,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.

# ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడిగా గూళ్ళ కనకయ్య ఎన్నిక

**ప్రజాభూమి ప్రతినిధి, చిగురుమామిడి:**



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం నవాబుపేట గ్రామ ముదిరాజ్ కుల సంఘం అధ్యక్షుడిగా గుల్ల కనకయ్య ఆదివారం ఎన్నికైనట్లు సొసైటీ అధ్యక్షులు గుళ్ల బాలయ్య తెలిపారు. ఆదివారం ముదిరాజ్ సంఘం భవనంలో ఎన్నికల నిర్వహించగా కనకయ్య గెలుపొందినట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన కుల సంఘం సభ్యులందరికీ కనకయ్య పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.అందరి సహకారంతో సంఘం అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని కనకయ్య పేర్కొన్నారు.ఎన్నికైన కనుకయ్యను పలువురు శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు.శ్రీ పెద్దమ్మతల్లి ఆలయం జాతరకు పూర్తవుతుందని,త్వరలోనే విగ్రహ ప్రతిష్టను పెద్ద ఎత్తున నిర్వహిస్తామని సంఘం నాయకులు తెలిపారు.210మంది సభ్యులు ఉన్న ముదిరాజ్ సంఘానికి 4గుంటల స్థలంలో కమ్యూనిటీ భవనం నిర్మించామని,చుట్టూ ప్రహరీ గోడ కోసం నిధులు మంజూరు చేయాలని మంత్రి పొన్నం ప్రభాకర్ ను వారు కోరారు.ఈ కార్యక్రమంలో మత్స్య పారిశ్రామిక సహకార సొసైటీ అధ్యక్షులు గుళ్ళ బాలయ్య, ఉపాధ్యక్షులు గూళ్ల వెంకటేశం, కార్యదర్శి పిల్లి కొమురయ్య, కుల సంఘం మాజీ అధ్యక్షులు కడారి రాజమౌళి,డైరెక్టర్లు గూళ్ళ బాలయ్య,గూళ్ల రవి,పొలవేణి, సంపత్,పిల్లి రమేష్,పిల్లి వేణు, పిల్లి శ్రీనివాస్ కుల సంఘం సభ్యులు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# రెడ్డి జేఏసీ నూతన కార్యవర్గం ఎన్నిక

**ప్రజాభూమి ప్రతినిధి,చిగురుమామిడి:**

కరీంనగర్ జిల్లా రెడ్డి జెఎసి ఆధ్వర్యంలో చిగురుమామిడి మండల రెడ్డి జెఎసి మండల కమిటీని ఆదివారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు.మండల అధ్యక్షులుగా కల్వల రాజేశ్వర్ రెడ్డి(గాగిరెడ్డిపల్లె),ఉపాధ్యక్షులుగా కరివేద మహేందర్ రెడ్డి(గునుకులపల్లే),ప్రధాన కార్యదర్శిగా మంకు శ్రీనివాస్ రెడ్డి(నవాబుపేట),వర్కింగ్ ప్రెసిడెంట్ గా ఐరెడ్డి చంద్రారెడ్డి, యూత్ అధ్యక్షులు గా తాటికొండ సందీప్ రెడ్డి(రేకొండ),గౌరవ అధ్యక్షులుగా చీల లక్ష్మారెడ్డి,సింగిరెడ్డి స్వామి రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రెడ్డి జేఏసీ నాయకులు తెలిపారు.రెడ్డిలకు హక్కుల సాధనకు కృషి చేస్తానని,రెడ్డి జేఏసీ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని అధ్యక్షుడు రాజేశ్వర్ రెడ్డి తెలిపారు.తన ఎన్నికకు సహకరించిన జిల్లా నాయకులకు, మండల నాయకులకు రాజేశ్వర్ రెడ్డి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ అధ్యక్షులు పెండ్యాల రాంరెడ్డి,జిల్లా అధ్యక్షులు జున్నుతుల రాజారెడ్డి,ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రెటరీ ఏనుగు చుక్కారెడ్డి,జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారం జగన్నాథ్ రెడ్డి, గ్రామాల అధ్యక్షులు గడ్డం సురేందర్ రెడ్డి,సింగిరెడ్డి రాజిరెడ్డి,జగ్గారెడ్డి,రాజేశ్వర్ రెడ్డి, సుధాకర్ రెడ్డి,బాల్ రెడ్డి,నాగిని లక్ష్మారెడ్డి,శ్యామకూర సంపత్ రెడ్డి,కిష్టారెడ్డి,తిరుపతి రెడ్డి,మల్లారెడ్డి నరేందర్ రెడ్డి,మహేందర్ రెడ్డి,రాజేందర్ రెడ్డి, కొండల్ రెడ్డి,పీచు మల్లారెడ్డి, నారాయణరెడ్డి,పీచు ప్రభంజన్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మధు సుధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**తిమ్మాపూర్ లో:**

కరీంనగర్ జిల్లా రెడ్డి జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం తిమ్మాపూర్ మండల రెడ్డి జేఏసీ కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షులుగా చెన్నాడి నరసింహారెడ్డి,ఉపాధ్యక్షులుగా పెండ్యాల రామకృష్ణారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా ఎల్లాల సదానందరెడ్డి,గౌరవ అధ్యక్షులుగా బద్దం వెంకటరెడ్డి ,మహిళా అధ్యక్షురాలిగా ఎల్లాల స్వరూపరెడ్డి లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు ఈ సందర్భంగా ఎన్నికైన మండల జేఏసీ కమిటీ అధ్యక్షుడు మా మీద నమ్మకం ఉంచి ఎన్నుకున్న జేఏసీ జిల్లా కమిటీ, మండల రెడ్డి నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు ఈ సమావేశంలో ఉత్తర తెలంగాణ అధ్యక్షులు పెండ్యాల రాంరెడ్డి జిల్లా అధ్యక్షుడు జున్నుతుల రాజారెడ్డి ఉమ్మడి జిల్లా జనరల్ సెక్రటరీ ఏనుగు చుక్కరెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ దారం జగన్నాద్ రెడ్డి మరియు కుల సంగ నాయకులు పాల్గొన్నారు



# వేములవాడలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు



**ప్రజాభూమి ప్రతినిధి, వేములవాడ :**

వేములవాడ పట్టణంలోని మూల వాగు బ్రిడ్జి పైన వాహనాదారులకు వేములవాడ టౌన్ ఎస్సై రమేష్, వేములవాడ ట్రాఫిక్ ఎస్ఐ సముద్రాల రాజు ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ నిర్వహించారు. ఈ తనిఖీల్లో భాగంగా ఎనిమిది మందిపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశామని, వాహనాదారులు కొందరికి చలాన్ విధించినట్లు తెలిపారు.. ట్రాఫిక్ రూల్స్ ను విధిగా అందరు పాటించాలని మైనర్స్ ని వాహనాలు నడిపించినచో కఠిన చర్యలు తప్పవని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# మత్స్య కార్మిక కుటుంబాల అభ్యున్నతే లక్ష్యం

- మిడ్ మానేరు రిజర్వాయర్ లో చేప పిల్లల విడుదల
- పాల్గొన్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- రుద్రవరంలో ఉచితంగా 80 వేల చేప పిల్లల విడుదలకు శ్రీకారం

**ప్రజాభూమి ప్రతినిధి, వేములవాడ :**



మత్స్య కార్మిక కుటుంబాల ఆర్థిక అభ్యున్నతే లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరు పరిధిలోని వేములవాడ అర్బన్ మండలం రుద్రవరంలో ఉచితంగా 80 వేల చేప పిల్లల పంపిణీ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆదివారం శ్రీకారం చుట్టారు.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మత్స్యకారులకు 100% సబ్సిడీతో ఉచిత చేప బిల్లులను పంపిణీ చేసే కార్యక్రమాన్ని యజ్ఞంల నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ నెల నాలుగవ తేదీన మంత్రివర్యులు పొన్నం ప్రభాకర్ ఎల్ఎండిలో చేప పిల్లల్ని విడుదల చేశారని గుర్తు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 53 కోట్ల చేప పిల్లల విడుదల కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.. చేపలను తినడం వల్ల ఆరోగ్యానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు.. చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు మరణించిన మత్స్య కార్మికులకు ఐదు లక్షల ఆర్థిక సహాయం చేయడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుంది అన్నారు.. మిడ్ మానేరు జలాశ పరిధిలోని రుద్రావరం గ్రామంలో గతంలో కేజీ కల్చర్ చేప పిల్లల పెంపకంపై అవగాహన కల్పించాం.. మత్స్యకారులు ముందుకు వస్తే సబ్సిడీ ద్వారా కేజీ కల్చర్ చేపల యూనిట్ మంజూరు చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని పేర్కొన్నారు.. దానికి సరిపడా మార్కెటింగ్ అవకాశాలను కూడా కల్పిస్తామని తెలిపారు.. రాజన్న సిరిసిల్ల జిల్లా కార్మిక ధార్మిక క్షేత్రంగా విరజిల్లుతుందని అన్నారు.. మన ప్రాంత అభివృద్ధి లక్ష్యంగా ముందుకు పోతున్నామని ఇప్పటికే వేములవాడలో 50 కోట్లతో యారన్ డిపో, రాజన్న ఆలయ అభివృద్ధికి 50 కోట్ల నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు.. మత్స్యకారులు అన్ని అవకాశాలను అందిపుచ్చుకోనికి ముందుకు పోవాలని పిలుపునిచ్చారు.. జిల్లా లోని 8642 మత్స్య కార్మిక కుటుంబాలకు చేతినిండా పని, ఆర్థికంగా ప్రగతిలోకి తీసుకువచ్చేందుకు మత్స్య శాఖ ఆధ్వర్యంలో మిడ్ మానేరులో మొత్తం 14 లక్షల పైచిలుకు చేప పిల్లలను విడుదల చేయనున్నామని వెల్లడించారు. ఇందులో భాగంగా మొదటి విడుతలో 80 వేల చేప పిల్లలను ఈ రోజు విడుదల చేశామని తెలిపారు. కార్యక్రమంలో ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్, అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్, వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా మత్స్యశాఖ అధికారి వరదారెడ్డి, అర్బన్ తాసిల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ఆది

**ప్రజాభూమి ప్రతినిది వేములవాడ:**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రైతులు మద్దతు ధరకు కొనుగోలు కేంద్రాలు ధాన్యాన్ని అమ్మాలన్నారు. దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ భీమ్యానాయక్, ఆర్డీవో రాజేశ్వర్ పాల్గొన్నారు.



# పది నెలల పాలనలో తెలంగాణకు, ప్రజలకు ఒరిగింది ఎంలేదు

**ప్రజాభూమి కుత్బుల్లాపూర్ :**

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కీ చింది మేడ్చల్ మల్కాజ్గిరి అర్బన్ బీజేపీ యువ మోర్చా కార్యావర్గ సభ్యులు మల్యం మణి గారు సంయుక్త పత్రిక ప్రకటన చేశారు మీడియా మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు పది నెలలు పాలన గత ప్రభుత్వ పాలన లాగే ఉంది. ఈ ప్రభుత్వం తీరుచస్తే సర్వ రోగానివారిణి హైడ్రా,మరియు మూసి ప్రక్షాళన అన్నట్టుగా ప్రస్తుత ముఖ్యమంత్రి తీరు కనిపిస్తుంది,ఆరు గారేంటి గాలికి వదిలేసి పెదప్రజల నివాసలను కూల్చడం, వారి పట్ల చిన్నచూపుతో వ్యవహరించడం చాలా బాధాకరం పేదలు వేసిన ఓటుతో గద్దెనెక్కి పేదల జీవితలను కబలించడం కాంగ్రెస్ పార్టీకి వెనతో పెట్టినవిద్య, ఇచ్చిన హామీలను గాలికి వదిలేసి పది నెలలుగా కాలయాపన చేస్తున్నారు రేవంత్ రెడ్డి గారి పది నెలల పాలనకు సున్నా మార్కులు వేస్తున్నాం. సూపర్ సిక్స్‌లో సిక్స్ ఇంకా పెండింగ్ ఉన్నాయి. రైతులకు,కౌలు రైతులకు ఏడాదికి 15 వేలు ఇస్తాము అన్నారు. ఎప్పుడు ఇస్తారో తెలియదు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత కరెంట్ అన్నారు పంట నష్టం జరిగితే ఒక్క రూపాయి ఇవ్వలేదు. నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు.. లేకుంటే రూ.3వేల నిరుద్యోగ భృతి అన్నారు. అటు ఉపాధి లేదు.. ఇటు భృతి లేదు. Brs 10 ఏండ్ల ప్రభుత్వం లో ఉన్నపుడు ఇలాగే రూ.3వేలు భృతి అని మోసం చేశారు. ఇప్పుడు కూడా ఇస్తారో లేదో నమ్మకం లేదు. మహాలక్ష్మి పథకం ద్వారా నెలకు మహిళలకు రూ.2500 అన్నారు. దీనిపైనా స్పందన లేదు.వికలాంగులకి,.6వేలు వృద్దులు వితంతులకి 4వేలు పెంక్షన్ హామీలు అమలు కాలేదు. ఈ పథకలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. పథకాల అమలు పై ప్రశ్నిస్తుంటే.. రాష్ట్రం అప్పుల్లో ఉంది అంటున్నారు. మరి అప్పుల్లో ఉన్న సంగతి ఎన్నికల ముందు తెలుసు కదా.. మరి అలాంటప్పుడు ఎందుకు అలవికానీ హామీలు ఇచ్చారు 100రోజుల పాలనంటూ



ప్రపంచమంతా స్విమ్ ఎవరెస్టుగా పిలిచే ఇంగ్లీష్ ఛానల్ ను 43 సంవత్సరాల వయసులో ఈదిన తొలి తెలుగు మహిళగా ఓపెన్ వాటర్ స్విమ్మర్ గంధం క్వీని విక్టోరియా ని మహంకాళి ఇన్స్ పెక్టర్ పరశురామ్ రూ.20,000/నగదు పురస్కారం అందించారు. ప్రపంచంలోని ఏడు చానల్స్ లో మిగతా ఆరు చానల్స్ ను కూడా ఈదాలని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు, పోలీసు వారికి ధన్యవాదాలు తెలియజేశారు.

-సికింద్రాబాద్, ప్రజాభూమి

# అదృష్టంతో ఉద్యోగం రాదు.. కష్టపడితేనే ఉద్యోగం వస్తుంది

**సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్**

**ప్రజాభూమి ప్రతినిధి, గన్నేరువరం:**



అదృష్టం తో ఉద్యోగం రాదని రాత్రింబవళ్లు కష్టపడి సంబంధిత సబ్జెక్టులపై సంపూర్ణ అవగాహన కలిగి ఉంటేనే ఉద్యోగం వస్తుందని సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ అన్నారు. మండలంలోని చీమలకుంటపల్లి గ్రామానికి చెందిన రామిడి సాగర్ ప్రభుత్వ ఉపాధ్యాయునిగా నియామకం కాగా ఆదివారం రామిడి సాగర్ ను సిపిఎస్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హన్మండ్ల భాస్కర్ శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హన్మండ్ల భాస్కర్ మాట్లాడుతూ చదువుతోనే సమాజంలో గుర్తింపు ఉంటుందని మన ఆర్థిక స్థితిగతులను మార్చేస్తుందని అన్నారు.నేటి యువత వ్యసనాలకు దూరంగా ఉండి లక్ష్యసాధన కోసం పాటుపడి తగిన కృషితో లక్ష్యాన్ని సాధించ వచ్చునని అన్నారు. చదువు క్రమశిక్షణను అలవరస్తుందని చదువులో ఆనందం పొందితే జీవితంలో ఉన్నత శిఖరాలను చేరుకుంటామని అన్నారు. నేటి యువత తమ శక్తిని వృధా చేస్తున్నారని చదువు జీవితాన్ని మార్చేస్తుందని అన్నారు. రామిడి సాగర్ ను నేటి యువత ఆదర్శంగా తీసుకొని ముందుకు సాగాలని అన్నారు. ఉపాధ్యాయునిగా నియామకమైన సాగర్ జన్మనిచ్చిన తల్లిదండ్రులకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులకు జన్మనిచ్చిన చీమలకుంటపల్లి గ్రామానికి పేరు తీసుకువచ్చారని అన్నారు. సాగర్ తో పాటు తన భార్య నవ్య కు కూడా ప్రభుత్వ ఉపాధ్యాయ ఉద్యోగం రావడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో సుధాకర్ శాంత కుమార్ సింగ్ రాణి తదితరులు పాల్గొన్నారు.

# చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

**ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం**

**ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర :**



రైతులు పండించిన ధాన్యం చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఆదివారం గంగాధర మండలం ఉప్పర మల్యాల, రంగారావు పల్లి గ్రామాల్లో వరి ధాన్యం కొనుగోల కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు దాన్యం అన్ని మద్దతు ధర పొందాలని, రైతులు దళారులను నమ్మి మోసపోయి తక్కువ ధరకు ధాన్యం అమ్మి నష్టపోవద్దని, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు ఇబ్బంది పడకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేయాలని,క్షేమశాతం వచ్చిన వడ్లను వెంటవెంటనే కొనుగోలు చేసి మిల్లులకు తరలించాలని,ధాన్యం తీసుకోవడంలో మిల్లర్లు ఇబ్బందులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామని, ధాన్యం కొనగోళ్ళలో ఇబ్బందులు ఉంటే మా దృష్టికి తీసుకు వస్తే పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.నిర్వాహకులు అధికారులు సమన్వయంతో ధాన్యం కొనుగోలను పూర్తి చెప్పదండి మల్లె సత్యం వారికి సూచించారు. ఈ ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకుల పంపిణీ



**ప్రజాభూమి ప్రతినిధి, కొడిమ్యాల:**

కొడిమ్యాల మండలం చెప్యాల గ్రామం లో శుక్రవారం గామా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిరుపేదలకు నిత్యవసర సరుకులతో పాటు పెన్షన్ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా 30 మందికి నిత్యవసర వస్తువులు, పదిమందికి రూ. 1000 చొప్పున పెన్షన్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చొప్పదండి నియోజకవర్గం ప్రాజెక్టు డైరెక్టర్ జోగు పౌలు, చెప్యాల గ్రామ సెక్రటరీ స్వామి, మాజీ సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీటీసీ మల్లారెడ్డి, ఉప సర్పంచ్ గుంటి ఎల్లయ్య మరియు మండల కోఆర్డినేటర్ ద్యావ రాకేష్ శర్మ, దీకొండ కళ్యాణ్ వర్మ, కవిత, కార్తీక్ మరియు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



# జన్వాడ రేవ్ పార్టీపై కేటీఆర్ ఏం చెబుతారు

**ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**

**ప్రజాభూమి ప్రతినిది వేములవాడ:**

జన్వాడ ఫామ్ హౌస్ రేవ్ పార్టీపై కేటీఆర్ ఏం సమాధానం చెబుతారో అని ఎమ్మెల్యే ఆది ప్రశ్నించారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ బావ మరిది ఎంత మందికి డ్రగ్స్ అలవాటు చేశారోనని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. డ్రగ్స్ అంశం తెరమీదికి వచ్చినప్పుడల్లా కేటీఆర్తో అనుబంధం ఉన్నవారే బయటకు వస్తున్నారన్నారు. దీనిపై సమగ్ర విచారణ దోషుల్ని ఎవర్నీ వదిలి పెట్టవద్దని పోలీసుల్ని కోరారు.



# కేటీఆర్ మతి భ్రమించి మాట్లాడుతున్నారు

**ప్రజాభూమి ప్రతినిది, వేములవాడ:**


వేములవాడ అర్బన్ మండలంలో ఆదివారం ఏర్పాటు చేసిన చేప పిల్లల విడుదల కార్యక్రమంలో రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయి కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. అధికారం పోయినంక ఆగమవుతున్నారన్నారని కేటీఆర్ ను ఉద్దేశించి ఆరోపించారు. రేవంత్రెడ్డిని విమర్శించే స్థాయికి కేటీఆర్కు లేదన్నారు. సీఎం కాలి గోటికి కూడా కేటీఆర్ సరిపోరని తీవ్రంగా వ్యాఖ్యానించారు.



# ఆత్మ గౌరవ సభకు తరలిన మాల సంఘం నేతలు

**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్ :**

నాగర్ కర్నూల్ లో నిర్వహించిన మాలల ఆత్మగౌరవ సభకు ఆదివారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా మాల మహానాడు నాయకులు తరలివెళ్లారు. నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన మాలల ఆత్మ గౌరవ సభకు మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మెడి అంజయ్య,వెన్న రాజు కరీంనగర్ జిల్లా మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు కాడే శంకర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలుక ఆంజనేయులు, జిల్లా మీడియా ఇన్చార్జి గొట్టె అర్జున్ తదితరులు సభకు తరలి వెళ్ళారు




# రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

**ఎమ్మెల్యే కవ్వంపల్లికి రేషన్ డీలర్ల వినతి**

**ప్రజాభూమి ప్రతినిధి, తిమ్మాపూర్:**

తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఆదివారం మండలంలోని రేషన్ డీలర్ల సమస్యలపై ఎమ్మెల్యే డా.కవ్వంపల్లి సత్యనారాయణ కు వినతి పత్రం అందించారు. అనంతరం ఆ సంఘం అధ్యక్షుడు మాట్లాడుతూ ప్రతి రేషన్ డీలర్లకు ఐదు వేల రూపాయల గౌరవ వేతనం , కమీషన్ ఒక క్వింటాలుకు మూడు వందల రూపాయలు పెంచాలి రేషన్ డీలర్ మరియు డీలర్ల కుటుంబ సభ్యులకు హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులు ఇవ్వాలి బియ్యం దిగుమతి హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించాలని అని అన్నారు. ఈ కార్యక్రమం లో మండల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



# ఏఎంసి చైర్మన్ తిరుపతిరెడ్డికి ఘన సన్మానం

**ప్రజా భూమి ప్రతినిధి, తొర్రురు:**

తొర్రూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నియామకమైన సందర్భంగా హనుమాండ్ల తిరుపతి రెడ్డిని మాటేడు కాంగ్రెస్ నాయకులు మండల పార్టీ అధ్యక్షులు సుంచు సంతోష్ తో కలిసి షాలువాతో సన్మానించారు. అనంతరం పుష్పగుచ్చం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ అందరి అభిమానం వల్లనే నన్ను ఏఎంసి చైర్మన్ గా నియమించడానికి సాధ్యపడిందని ఎల్లవేళలా రైతుల పక్షాన ఉంటూ రైతుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో మహంకాళి సురేందర్, తలారి వెంకటేష్, మహంకాళి ప్రశాంత్,తదితరులు పాల్గొన్నారు.




# బాడీ ఫ్రీజర్ దాతలని సన్మానించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**ప్రజాభూమి ప్రతినిధి, గంగాధర :**

గంగాధర మండలం లోని ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన చిప్ప కళావతి, సత్యనారాయణల అక్క కీర్తిశేషులు చిప్ప భూదేవి జ్ఞాపకార్థం బాడీ ఫ్రీజర్ను గ్రామపంచాయతీకి విరాళంగా అందించారు. బాడీ ఫ్రీజర్ ని ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం దాతలను ఘనంగా సన్మానించి, అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్, ఫ్రాక్స్ చైర్మన్ మండల అధ్యక్షులు, మండల నాయకులు మరియు గ్రామానికి చెందిన నాయకులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు..

# రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ యువకుడి మృతి



నరేష్ ఫైల్ ఫోటో



నరేష్ కుటుంబ సభ్యులను ఓదార్చుతున్న రసమయి బాలకిషన్

**ప్రజాభూమి ప్రతినిధి, బెజ్జంకి:**

రోడ్డు ప్రమాదంలో గాయపడి యువకుడు మృతి చెందిన ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. వివరాల్లోకి వెళ్తే బెజ్జంకి మండలంలోని బేగంపేట గ్రామానికి చెందిన ఎలా నరేష్ (30) కరీంనగర్ లోని ఓ కంపెనీలో జాబ్ చేస్తున్నాడు. రోజూ లాగే విధులు ముగించుకుని ఇంటికి తిరిగి వస్తున్న క్రమంలో తిమ్మాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామ పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురుగా రాంగ్ రూట్ లో వస్తున్న వాహనం ఢీ కొనడంతో తీవ్ర గాయాలపాలైన నరేష్ ను కరీంనగర్ లోని హాస్పిటల్ కు తరలించి చికిత్స అందించారు. ఈ నేపథ్యంలో ఆరోగ్యం క్షీణించి నరేష్ ఆదివారం చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ముక్కు పచ్చలారని పిల్లల్ని చూసి అక్కడున్నవారు కన్నీరు మున్నీరుగా విలపించారు.

**శోకసంద్రంలో బేగంపేట**

ఎలా నరేష్ మృతితో బేగంపేట గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. అందరితో కలిసిమెలిసి ఉండే నరేష్ మృతి చెందాడు అన్న చేదు నిజాన్ని గ్రామస్థులు జీర్ణించుకోలేక పోతున్నారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలకరించే తమ మిత్రుడు తమకు దూరమయ్యాడు అంటూ నరేష్ స్నేహితులు, సన్నిహితులు బోరున విలపించారు. నరేష్ భౌతిక కాయం కడసారి చూపుకు బేగంపేట తరలివచ్చింది. అంతిమయాత్రలో ఇసుకేస్తే రాలనంతగా జనం వచ్చి నరేష్ తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకొని కన్నీటి పర్యంత మయ్యారు. ఇక తమ మిత్రుడు లేడని నరేష్ చిన్ననాటి మిత్రులు శోకసంద్రంలో మునిగిపోయారు.

**బాధిత కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే రసమయి పరామర్శ**

మానకొండూర్ బీఆర్ఎస్ సోషల్ మీడియా ఇంచార్జ్ ఎలా శేఖర్ బాబు సోదరుడు ఎలా నరేష్ మృతిచెందాడు అన్న విషయం తెలుసుకుని మానకొండూర్ మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ ఆదివారం నరేష్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నరేష్ తండ్రి పోచయ్య, సోదరుడు శేఖర్ బాబుతో పాటు ఆయన కుటుంబ సభ్యులను ఓదార్చారు. అధైర్య పడొద్దు తాను అండగా ఉంటాను అంటూ బాధిత కుటుంబాన్ని భరోసానిచ్చారు. రసమయి వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్ రెడ్డి, లింగాల లక్ష్మణ్, కనగండ్ల తిరుపతి, చింతలపల్లి రవీందర్ రెడ్డి, చింతల పల్లి సంజీవ రెడ్డి, కచ్చు రాజయ్య, బుర్ర భూమేష్ గౌడ్ తో పాటు బీజేపీ రాష్ట్ర నాయకులు సొల్లు అజయ్ వర్మ నరేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# "విపశ్యన"తోనే మానవుడు మహోన్నతుడు





పుల్లెంల గణేష్ (ధర్మ సమాజ్ పార్టీ, స్టడీ & రీసెర్చ్ టీం రాష్ట్ర ఇంచార్జ్)
9553041549

**ఈ విపస్సన ధ్యాన సాధన ద్వారా విశ్వ మానవాళికి దాగి ఉన్న ప్రయోజనాలను గ్రహించిన తాత్వికులు "ధర్మ సమాజ్ పార్టీ" వ్యవస్థాపక అధ్యక్షులు "డా. విశారదన్ మహారాజ్" తమ కార్యకర్తలని, నాయకులని విపస్సన ధ్యాన శిబిరాలలో శిక్షణ పొందేలా ఎందుకు ప్రోత్సహిస్తున్నారో పది రోజుల నా శిక్షణ తదనంతరం అర్ధమైనది. సామాజిక రాజకీయ ఆర్థిక సాంస్కృతిక పరివర్తన పట్ల ఎంతటి నిబద్ధత చిత్తశుద్ధి ఉన్నదో ప్రపంచంలో ఏ రాజకీయ పార్టీలకి లేని నామాన్ని తన ఆధ్వర్యంలోని ధర్మ సమాజ్ పార్టీ గా పేరు పెట్టి, ధర్మ అనే పేరు పెట్టడంతోనే ఎన్నికల ప్రక్రియలో పాల్గొనక ముందే ఓట్ల సీట్లు సాధించకముందే భారత ఎన్నికల కమిషన్ చేత ఎందుకు మన్ననలను విశారదన్ మహారాజ్ పొందాడో విపస్సన ధ్యాన కేంద్రంలో ధర్మాన్ని తెలుసుకున్నాక వారి యొక్క ఆలోచన మూలాల లోతూ స్పష్టంగా అర్థమైనది. హిందూ మతాన్ని పాటించే సంప్రదాయుల ప్రకారం వారి జీవితకాలంలో ఒక్కసారైనా కాశీకి పోవాలని కోరిక ఉంటది. అలాగే ముస్లింల సంప్రదాయం ప్రకారం వారి జీవిత కాలంలో ఒక్కసారైనా మక్కాకి పోవాలనే సంప్రదాయం ఉంటది.**

విశ్వ మానవులందరి వారి సుఖ: దుఃఖల నుండి విముక్తులను చేసి, లేని వాటి కోసం బాధ పడుతూ బెంగపడకుండా ఉన్న వాటితో సంతోషంగా బ్రతకడం కోసం, క్రీ.పూ.2500 సంవత్సరాల క్రితం ప్రాచీన భారతదేశంలో సిద్ధార్థ గౌతముడు బుద్ధుడు గా మారి విశ్వ జనులందరికీ అందించిన గొప్ప విద్యనే విపశ్యన ధ్యానం. పశ్యము అనగా అర్థం చూడడము విపస్యనము అనగా ఉన్నది ఉన్నట్టుగా వాస్తవాన్ని సత్యాన్ని గ్రహించడము. సంస్కృతంలో విపశ్యనముగా, పాళీ భాషలో విపస్సనగా పలుకుతారు. ఈ విపస్సన జ్ఞాన పద్ధతి మనసులోని వికారాన్ని సమూలంగా నిర్మూలించి తద్వారా సంపూర్ణ విముక్తి వలన లభించే పరమానందాన్ని కలగజేస్తుంది. ఈ విపస్యన ధ్యానము విశ్వ మానవులందరినీ మహోన్నతులుగా తీర్చిదిద్దుతూ జీవించే కల మరియు మరణించే కల నేర్పుతుంది. ఇంత అద్భుతమైన విద్యని చదివి వినడం ద్వారానే తృప్తి చెందకుండా ఒక వ్యాస కర్తగా ప్రత్యక్షంగా అనుభవించి పరివర్తన చెందాలని ఉద్దేశంతో రీసెంట్ గా దమ్మ నాగార్జున అంతర్జాతీయ విపశ్యాన ధ్యానం కేంద్రంలో అక్టోబర్ 2 నుండి 13 వరకు మొత్తంగా పది రోజుల విపశ్యాన ధ్యాన శిక్షణ పొందడం జరిగింది. అయితే ఈ విపస్సన ధ్యాన కేంద్రాలలో సాధకుల భౌతిక ప్రపంచం ఎలా ఉంటది అంటే ఈ ధ్యానాన్ని నేర్చుకునే వ్యక్తులు వారి శిక్షణ పూర్తి అయ్యే అన్ని రోజుల వరకు శిక్షణ శిబిరంలో మొబైల్స్ వాడకూడదు పుస్తక పఠనం చేయకూడదు ఏమి రాసుకోవడానికి కూడా అవకాశం ఉండదు పూర్తిగా ఆర్య మౌనం పాటించాలి.ఆర్య మౌనం అనగా 1.ఎవరితోనూ మాట్లాడకూడదు 2.ఎవరితో చూపులు కలపకూడదు 3.ఎవరితో కలిసి నడవకూడదు 4.ఎప్పుడు క్రిందకు చూస్తూ నడవాలి. ఈ విపస్సన ధ్యాన సాధన చేసే సాధకుడు తన అయిన వారందరినీ వదులుకొని శిక్షణ కేంద్రానికి వచ్చి బాహ్య ప్రపంచంతో ఎలాంటి సంబంధం లేకుండా ఒక సన్యాసి వలె జీవిస్తూ శిక్షణ పూర్తయ్యే వరకు కూడా ప్రపంచ జ్ఞానాన్ని విశ్వ సత్యాన్ని ఎవరో చెప్పింది విన్నదానితో కాకుండా, పుస్తకాలు చదవడం ద్వారా వచ్చిన విజ్ఞానంతో తృప్తి చెందకుండా తనకు తానుగా తన శరీరంలో జరిగే మనో సంవేదనల రూపంలో వచ్చే సమాధానలు బట్టి విశ్వ మానవళి పుట్టుకకి అర్థాన్ని ప్రకృతి ధర్మాలను లోక రహస్యాన్ని తెలుసుకొని సుఖ దుఃఖాదుల నుండి విముక్తులవుతారు. మరి విపస్సన ధ్యాన కేంద్రాలలో ముఖ్యంగా ఏమి నేర్పబడును అంటే ధర్మం నేర్పబడును మరి ఏంటా ధర్మం అనగా హిందూ ధర్మం కాదు, ముస్లిం ధర్మం కాదు, క్రిస్టియన్ ధర్మం కాదు, సిక్కు ధర్మం కాదు, బౌద్ధ ధర్మం కాదు, పార్శియన్ ధర్మం కాదు. నేటి ఆధునిక ప్రపంచంలో ధర్మానికి ఉన్న అర్థాన్నే మార్చేశారు అయ మత పెద్దలు అయా మత సంఘాలు నాయకులు కానీ నిజంగా ధర్మం అనగా ప్రకృతి చట్టం, ప్రకృతిలో నియమ నిబంధనలే ధర్మం, ప్రకృతి సత్యమే నిజమైన ధర్మం. ఈ విపస్సన ధ్యాన కేంద్రాలకి కుల మత లింగ ప్రాంతీయ వివిధ భేదాలకి అతీతంగా సాధకులు వచ్చి పూర్తి ఉచిత శిక్షణ పొందడం చూస్తుంటే విపస్సన ధ్యానం అనేది ఏ మతానికో ఏ కులానికో ఏ వర్గానికో చెందినదిగా కాకుండా విశ్వజనమైనది సార్వకాలికమైనది సర్వజనినమైనదిగా విపస్సన ధ్యానము విశ్వజనులందరి చేత ఆచరించబడుతున్నది.ఈ ధ్యానములో శీలము సమాధి ప్రజ్ఞా ముఖ్యమైనవి.మానవుల దుఃఖన్ని అశాంతిని బాధలను రూపుమాపే ఒక గొప్ప ధ్యాన పద్ధతి విపస్సన. విపస్సన ధ్యానము ఇతర ధ్యానాలతో పోల్చితే లోతైనది కష్టతరమైనది.ఈ ధ్యానంలో మనసులో రూప,శబ్దాలపై కాకుండా కేవలం శ్వాస పైనే కేంద్రీకరిస్తారు. బుద్ధుడు విపస్సన ధ్యానాన్ని ఒక జీవనకలగా పేర్కొని అందరికీ బోధించాడు. లోపల యధార్థాన్ని యధాతథంగా చూస్తూ ప్రకృతిని పరిశీలించమని మాత్రమే ఆయన ఆదేశించాడు.ఏదో ఒక మతాన్ని గాని కొందరికి అనుకూలంగా మరి కొందరికి వ్యతిరేకంగా ఉండే సిద్ధాంతాన్ని గాని ఆయన బోధించలేదు. బుద్ధుని కాలంలో ఉత్తర భారతదేశంలో పెద్ద సంఖ్యలో ప్రజలు విపస్సన ధ్యాన సాధన ద్వారా బాధల నుండి బంధానల నుండి విముక్తులయ్యారు. బుద్ధుని ద్వారా ప్రాచీన భారతదేశంలో పుట్టిన ఈ విపస్సన ధ్యానం కాలక్రమేణా మయన్మార్( బర్మా), శ్రీలంక, థాయిలాండ్ ఇలా అనేక ప్రపంచక దేశాలకి విస్తరించింది. అయితే బుద్ధిని తదనంతరం ఐదు శతాబ్దల తర్వాత విపస్సన వారసత్వం భారతదేశ నుండి కనుమరుగైంది.ఈ ధ్యాన ఉపదేశంలోని స్వచ్ఛత కూడా తాను పుట్టిన దేశంలో కోల్పోయింది. అయితే మయన్మార్ దేశంలో అంకిత భావం కలిగిన గురుశిష్య పరంపర ద్వారా విపస్సన వారసత్వం కాపాడబడినది. ప్రఖ్యాత బర్మీస్ విపస్సన గురువు "సయ్యాగి యుభా ఖిన్" విపస్యన ధ్యానాన్ని అది జన్మించిన భారతదేశంలోకి పునర్జీవింప చేయాలని గట్టిగా కోరుకోవడంతో ఆయన నుండి అనుమతి పొంది ఆచార్య "సత్యనారాయణ గోయెంకా" భారతదేశంలో విపస్సన ధ్యానాన్ని పునర్జీవింప చేసారు.గోయెంకా భారతదేశంలో స్థిరపడి 1969 నుండి విపస్సన బోధించడం ప్రారంభించారు. మిగతా ధ్యానంలో ఎరుకలేని కాలరహిత సమాధి స్థితిని పొందితే,విపస్సన ధ్యానంలో వర్తమాన క్షణాన్ని ఎరుకతో గుర్తిస్తూ సమాధి స్థితిని పొందుతారు. మిగతా ధ్యానంలో సాధకుడు భూత భవిష్యత్ వర్తమాన కాలలు ఏమాత్రం తెలియని స్థితిలో సమాధి స్థితిని పొందితే,విపస్సన ధ్యానంలో సాధకుడు భూత భవిష్యత్ కాలాలను విడనాడి వర్తమానకాల స్థితిలోనే సమాధి స్థితిని అనుభవిస్తాడు.విపస్సన ధ్యానంలో ధ్యానం చేసేటప్పుడు సాధకులు పూర్తి స్పృహలో ఉండి అప్రమత్తుడై ఎరుకలో ధ్యానం చేస్తారు.అలా ధ్యానం చేసేటప్పుడు మనస్సులో ఎలాంటి రూప, శబ్దాదుల, వస్తువుల పైన కాకుండా శ్వాస పైనే లగ్నం చేస్తారు. మనసు పరిపరి విధాలా పక్కకు మల్లుతున్న అలా దారి తప్పుతున్న మనసును తీసుకువచ్చి మళ్లీ శ్వాను గమనించే పనిపై లగ్నం చేస్తారు. అంటే విపస్సనలో శ్వాసను ధ్యాన వస్తువుగా చేసుకొని ధ్యానం చేస్తారు. కనుక విపస్సన ధ్యానం కొంచెం కష్టతరమైనది. ఇతర ధ్యాన పద్ధతులలో సాధన చేసే వారికి మనసు రోగాలు నయం కావడం కంటే శారీరక రోగాలు తొందరగా అదుపులోకి వస్తాయి. కానీ విపస్సన ధ్యానంలో శారీరక మనస్సు రోగాలు రెండు అదుపులోకి వస్తాయి.ఈ విపస్సన ధ్యాన లక్షణం సంపూర్ణ దుఃఖ నివారణ కేవలం శారీరక వ్యాధులను నయం చేయడం దీని లక్ష్యం కాదు.అయితే మనస్సు నిర్మలం కావడం వల్ల ఇతర ఫలితాలతో పాటు శారీరక మానసిక బాధలు కూడా ఉపశమిస్తాయి.ఈ విద్య సమస్త దుఃఖాలకు కారణాలైన రాగ,ద్వేష మోహాలను నిర్మూలం చేసే జీవన కళ. అయితే ఈ విపశ్యన ధ్యాన కేంద్రాలకి ఎంతో ఉన్నత చదువులు చదివి ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగాల్లో స్థిరపడిన మరియు సామాన్య వ్యక్తులు కనీసం 10 రోజుల శిక్షణ పొందడానికి లీవ్స్ పెట్టి మరియు హాలిడేస్ సమయంలో వచ్చి విపశ్యన ధ్యానాన్ని నేర్చుకొని వెళ్లడం గమనర్హం.అయితే ఈ శిక్షణ పొందినందుకుగాను ఎలాంటి ఫీజు చెల్లించాల్సిన పని లేదు, పూర్తి ఉచితంగా నేర్పబడును. శిక్షణ అయిపోయిన తదనంతరం ఇంటికి వెళ్లే సమయంలో శిక్షణ పొందిన సాధకుల ఆర్థిక స్థోమతకి తగ్గట్టుగా ఎంతోకొంత ఆర్థిక సహాయం చేసే వెసులుబాటు ఉంటది అది కూడా కంపల్సరి కాదు, నూతనంగా శిక్షణ పొందే సాధకులకి సౌకర్యాలు ఏర్పాటు చేయడం కోసం, ఎందుకంటే అంతర్జాతీయంగా ఉన్న ఈ విపశ్యన ధ్యాన శిక్షణ కేంద్రాలు సాధకులు ఇచ్చే ఆర్థిక సహాయంతోనే స్వచ్ఛందంగా నడుస్తాయి తప్ప, ప్రభుత్వం నుండి ఎలాంటి ఫండ్స్ రావు.

అలాగే క్రిస్టియన్లకి వారి సంప్రదాయం ప్రకారం జెరుసలెం పోవాలనే సంప్రదాయం ఉంటది. కానీ విపస్సన ధ్యాన శిబిరంలో నేను శిక్షణ పొందాక నాకు అర్థమైన విషయం ఏంటంటే ప్రతి మనిషి కూడా కుల, మత విభిన్న భేదాలను అతీతంగా తమ జీవిత చివరి కాలంలో కాకుండా, బాల్య వయసు నుండే విపస్సన ధ్యాన ప్రాముఖ్యతను తెలుసుకొని సంసత్సరానికి ఒక పది రోజుల పాటు శిక్షణ పొందితే ఆ శిబిరంలో చెప్పే ధర్మ ప్రవచనాలని 100% పాటిస్తే విశ్వ మానవులందరూ కూడా తమ జీవితకాలంలో సమాజంలో బుద్ధిజీవులైన మానవులుగా ఏమి చేయాలో ఏమి చేయకూడదో పూర్తి స్పష్టతతో ఉంటూ తోటి మానవుల పై శత్రుత్వంతో ఉండకుండా విశ్వజనులందరి మధ్య ప్రేమ ఆప్యాయతలు ఉంటూ సుఖ దుఃఖాలతో సంతోషలతో జీవిస్తారు.అప్పుడు అంతిమంగా బుద్ధుడు చెప్పినట్టు బుద్ధుడి కంటే ముందు ఎంతో మంది బుద్ధులు ఉన్నారు, బుద్ధుడి తర్వాత కూడా ఎంతో మంది బుద్ధులు వస్తారు అనే సత్యం నిజమై విశ్వం అంత కూడా గుణవంతులతో శాంతితో విరజిల్లుతది.







# మెట్రో రెండవ దశ నాలుగేళ్లలో పూర్తి..?

## రూ.24,269 కోట్ల అంచనాలతో పనులు



**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్ :**
హైదరాబాద్ మెట్రో రైల్ రెండవ దశ ప్రాజెక్ట్ కు లైన్ క్లియర్ అయింది. సిటీ విస్తరిస్తున్న కొద్దీ ట్రాఫిక్ రద్దీ పెరగటంతో ఇప్పుడున్న మెట్రోను ఇతర మార్గాలకు విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. అందుకు సంబంధించిన డీపీఆర్ కు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఇందులో భాగంగా రూ.24269 కోట్ల అంచనాలతో చేపట్టే మెట్రో రెండో దశకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం రాగానే పనులు మొదలు పెట్టి రాబోయే నాలుగు సంవత్సరాలలో పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా ఎంచుకుంది. హైదరాబాద్ మెట్రో రైల్ మొదటి దశలో మూడు కారిడార్లలో 69 కిలోమీటర్లు విజయవంతంగా సేవలందిస్తోంది. ఈ ప్రాజెక్టును ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్య విధానంలో రూ.22,000 కోట్లతో నిర్మించారు. ప్రస్తుతం రోజుకు దాదాపు 5 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తున్నారు. రెండో దశ అందుబాటులోకి వస్తే సిటీలో రోజుకు మరో 8 లక్షల మంది మెట్రోలో ప్రయాణిస్తారు. మెట్రో రైల్ మొదటి దశ అమలైనప్పుడు హైదరాబాద్ దేశంలోనే ఢిల్లీ తర్వాత 2వ స్థానంలో నిలిచింది. గత ప్రభుత్వం ఏడేండ్లుగా మెట్రో విస్తరణను పట్టించుకోలేదు. ఈలోపు మిగిలిన నగరాలన్నీ రెండో, మూడో దశ నిర్మాణ కార్యక్రమాలు కూడా పూర్తి చేశాయి. గత ప్రభుత్వం నిర్వాకంతో ఒకప్పుడు 2వ స్థానంలో ఉన్న హైదరాబాద్ ఇప్పుడు దేశంలో 9వ స్థానానికి పడిపోయింది. ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కలకత్తా వంటి పెద్ద నగరాలతో పాటు, పూణే, నాగపూర్, అహ్మదాబాద్ చిన్న నగరాలు కూడా మెట్రో విస్తరణలో హైదరాబాద్ ని అధిగమించాయి. గత ప్రభుత్వం నిర్లక్ష్యంగా ఏడేండ్లు ఆలస్యం చేయటంతో తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం కూడా భారీగా పెరిగిపోయింది. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి అధికారం చేపట్టినప్పటి నుంచే కొత్త ప్రభుత్వం మెట్రో విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. హైదరాబాద్ లో ట్రాఫిక్ ఎక్కువగా ఉన్న మార్గాలతో పాటు అన్ని ప్రాంతాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మెట్రోను విస్తరించాలని నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా రెండవ దశలో అయిదు కారిడార్లలో 76.4 కిలో మీటర్ల మేరకు మెట్రో విస్తరణకు రాష్ట్ర మంత్రివర్గం ఆమోదం తెలిపింది. దీనికి సంబంధించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్) పూర్తయింది. ఇందులో ప్రస్తుతం మూడు కారిడార్లు ఉన్నాయి. రెండో దశ లో ప్రతిపాదించిన కొత్త 5 కారిడార్ల వివరాలు చూస్తే..

నాలుగో కారిడార్ నాగోల్– శంషాబాద్ ఎయిర్ పోర్టు వరకు (36.8 కి.మీ)

అయిదో కారిడార్ రాయదుర్గ్–కోకాపేట్ నియోపొలిస్ వరకు (11.6 కి.మీ)

ఆరో కారిడార్ ఎంజీబీఎస్–చంద్రాయన్ గుట్ట వరకు (7.5 కి.మీ)

ఏడో కారిడార్ మియాపూర్–పటాన్చెరు వరకు (13.4 కి.మీ)

ఎనిమిదో కారిడార్ ఎల్ బీ నగర్–హయత్ నగర్ వరకు (7.1 కి.మీ.)

ఈ మెట్రో రెండవ దశను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో పాటు పీపీపీ విధానంలో చేపడుతాయి. ఈ ప్రాజెక్టు మొత్తం అంచనా వ్యయం రూ.24269 కోట్లు. అందులో 30 శాతం అంటే రూ.7313 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం, 18 శాతం అంటే రూ.4,230 కోట్లు కేంద్ర ప్రభుత్వం వెచ్చిస్తుంది. మిగతా 52 శాతం నిధులను రుణాలతో పాటు పీపీపీ విధానంలో సమకూర్చుకుంటాయి.



## జనగామలో భారీ అగ్నిప్రమాదం

### ఎగిసిపడిన అగ్నికీలలు

**ప్రజాభూమి ప్రతినిధి,జనగాం :**
జనగామలో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. జిల్లా కేంద్రంలోని విజయషాపింగ్‌మాల్‌లో మంటలు చెలరేగాయి. ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్ కారణంగా ఒక్కసారిగా మంటలు చెలరేగగా.. షాపింగ్‌మాల్ పూర్తిగా దగ్ధమైంది. పక్కనున్న 5 షాపులకు మంటలు వ్యాపించాయి. పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ వస్త్ర దుకాణం కూడా పూర్తి దగ్ధమైంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పేందుకు ప్రయత్నిస్తున్నారు. మూడు గంటలు ప్రయత్నించినా ఇంకా మంటలు అదుపులోకి రాలేదు. ఒకే ఫైర్ ఇంజన్ ఉండడంతో మంటల్ని అదుపులోకి ఫైర్ సిబ్బంది తీసుకురాలేకపోయారు. అనంతరం స్టేషన్ ఘన్‌పూర్, పాలకుర్తి, ఆలేరు ప్రాంతాల నుంచి ఫైరింజిన్‌లు వచ్చి మంటలు ఆర్పే ప్రయత్నం చేస్తున్నాయి. ఈ అగ్నిప్రమాదంతో చుట్టుపక్కల స్థానికులు, షాప్ నిర్వాహకులు భయాందోళనకు గురవుతున్నారు. పక్కన ఉండే షాప్ నిర్వాహకులు షాపులను ఖాళీ చేస్తున్నారు. రెండు వస్త్ర దుకాణాలు పూర్తిగా దగ్ధం కాగా.. రూ.10 కోట్లకు పైగా ఆస్తి నష్టం వాటిల్లినట్లు అంచనా వేస్తున్నారు. తొలుత విజయ షాపింగ్‌మాల్‌లో మంటలు చెలరేగగా.. అనంతరం పక్కనే ఉన్న శ్రీలక్ష్మీ వస్త్ర దుకాణానికి మంటలు వ్యాపించాయి.

## కేటీఆర్ నివాసం దగ్గర ఉద్రిక్తత

### బీఆర్ఎస్ నేతల అరెస్ట్

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్ :**
హైదరాబాద్‌లోని ఓరియన్ విల్లాస్ దగ్గర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నివాసం వద్దకు ఆదివారం మధ్యాహ్నం భారీగా చేరుకున్న పోలీసులు బలవంతంగా లోనికి వెళ్లేందుకు ప్రయత్నించారు. ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని నిరసనలు తెలిపారు. సెర్చ్ వారెంట్ లేకుండా లోనికి వెళ్లేందుకు పోలీసులు యత్నించడంతో వారిని అడ్డగించారు. ఈ క్రమంలో బీఆర్ఎస్ నేతలతో పోలీసులు వాగ్వాదానికి దిగారు. రాజ్ పాకాల నివాసంలోకి వెళ్లకుండా అడ్డుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మాగంటి గోపీనాథ్, కేపీ వివేకానంద, కల్వకుంట్ల సంజయ్‌తో పోలీసులు దురుసుగా ప్రవర్తించారు. ఎమ్మెల్యేలు ప్రశ్నిస్తున్న పట్టించుకోకుండా నిర్లక్ష్య ధోరణితో వ్యవహరించారు. ఎమ్మెల్యేలను నెట్టుకుంటూ లోనికి వెళ్లేందుకు యత్నించారు. ఈ క్రమంలో ఎమ్మెల్యేలతో వాగ్వాదానికి దిగారు. దీంతో బీఆర్ఎస్ నేతలు కేపీ వివేకానంద, బాల్క సుమన్, రాజుసాగర్, రాకేశ్, ఆశిష్ యాదవ్ సహా 15 మంది అరెస్టు చేశారు. రాజకీయంగా ఎదుర్కొనే సత్తా లేక చివరికి కుటుంబసభ్యులు కలిసి జరుపుకుంటున్న వేడుకను రేవ్ పార్టీగా చిత్రీకరించారని కల్వకుంట్ల సంజయ్‌కుమార్ మండిపడ్డారు. నీచ ప్రచారం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డికి సిగ్గు ఉండాలని విమర్శించారు.



## కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో భక్తుల రద్దీ

**ప్రజాభూమి ప్రతినిధి,చేర్యాల :**
ప్రముఖ పుణ్యక్షేత్రమైన కొమురవెల్లి శ్రీ మల్లికార్జున స్వామి వారి క్షేత్రంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. మల్లన్నస్వామి మమ్మేలు స్వామి అంటూ భక్తులు చేసిన నామస్మరణలతో శైవక్షేత్రం పులకరించింది. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో మల్లన్న క్షేత్రానికి తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కొమురవెల్లి క్షేత్రానికి 10వేల మంది భక్తులు వచ్చి మొక్కులు తీర్చుకున్నట్లు ఆలయ ఈవో ఏ.బాలాజీ తెలిపారు. శనివారం సాయంత్రం నుంచే కొమురవెల్లికి చేరుకున్న భక్తులు ఆదివారం స్వామి వారిని దర్శించుకోవడంతో పాటు అభిషేకాలు, పట్నాలు, అర్చన, ప్రత్యేక పూజలు, ఒడి బియ్యం, కేశఖండన, గంగరేగు చెట్టు వద్ద ముడుపులు కట్టడం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. కొండపైన ఉన్న ఎల్లమ్మను దర్శించుకోవడంతో పాటు మట్టి పాత్రలతో అత్యంత భక్తిశ్రద్ధలతో బోనం తయారు చేసి మొక్కులు తీర్చుకున్నారు.


## నీటి సంపులో పడి చిన్నారి మృతి

**హనుమకొండ జిల్లాలో విషాదం**



**ప్రజాభూమి ప్రతినిధి,భీమదేవరపల్లి :**
ప్రమాదవశాత్తు నీటిసంపులో పడి చిన్నారి గడిపె అస్మిక(3) మృతి చెందిన విషాదకర ఘటన హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం రత్నగిరి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గడిపె సంపత్, స్వర్ణలకు ముగ్గురు సంతానం. దినసరి కూలీ పనిచేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కాగా, ఆదివారం అస్మిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లగా అస్మిక ఆడుకుంటూ వెళ్లి నీటి సంపులో పడింది. అటుగా వెళ్తున్న అస్మిక మేనత్త కూతురు సుశాంకిత నీటి సంపులో పడి ఉన్న బాలికను చూసి వెంటనే బయటకు తీసి కుటుంబసభ్యులకు సమాచారం అందించింది.108కి సమాచారమందించగా సిబ్బంది వచ్చి అస్మిక మృతి చెందినట్లు వెల్లడించారు. అస్మిక తండ్రి సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వంగర ఎస్ఐ దివ్య తెలిపారు. అస్మిక మృతితో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.





## ప్రియుడితో కలిసి భర్తను హతమార్చిన భార్య

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్ :**
ఈ రోజుల్లో ఆస్తికోసం ఎన్నో దారుణాలు జరుగుతున్నాయి. బంధాలు, బంధుత్వాలకు విలువ లేకుండా దారుణాలకు తెగబడుతున్నారు. జన్మనిచ్చిన వాళ్లను కూడా ఆస్తి కోసం హత్య చేసిన దాఖలాలు కూడా ఉన్నాయి. తాజాగా హైదరాబాద్‌కు చెందిన ఓ వ్యాపారవేత్త దారుణంగా హత్యకు గురయ్యాడు. వ్యాపారవేత్త రమేశ్‌కుమార్(54) హత్యకు గురయ్యారు. ఆయనను హైదరాబాద్ సమీపంలో హత్య చేసి ఊటీ ఎస్టేట్‌లో ఆయన మృతదేహాన్ని తగులబెట్టారు. ఉప్పల్‌భువనగిరి ప్రాంతంలో ఆయనను హత్య చేసినట్లు తెలిసింది. భార్య నిహారిక, ఆమె ప్రియుడు డాక్టర్ నిఖిల్ ఈ దారుణానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో తేలింది. వ్యాపారవేత్త రమేశ్‌కుమార్ మృతదేహాన్ని కర్ణాటక పరిధిలోని కొడగు కాఫీ ఎస్టేట్‌లో తగులబెట్టారు. కాఫీ తోటల్లో సగం కాలిన మృతదేహాన్ని కర్ణాటక పోలీసులు గుర్తించారు. మెర్సిడెస్ బెంజ్ కార్‌లో రమేష్ మృతదేహాన్ని హైదరాబాద్ నుంచి ఊటీ దగ్గర వున్న కాఫీ ఎస్టేట్‌కు నిహారిక తీసుకెళ్లింది. 8 కోట్ల రూపాయల ఆస్తి కోసమే నిహారిక భర్తను హైదరాబాద్‌లో హత్య చేయించినట్టు కర్ణాటక పోలీసులు విచారణలో తేల్చారు. రమేష్ హత్య చేసి కాఫీ ఎస్టేట్‌లో తగుల బెట్టిన రాణా అనే నిందితుడిని హర్యానాలోని ఓ డాబా వద్ద టీ తాగుతుండగా కర్ణాటక పోలీసులు అరెస్టు చేశారు. డాక్టర్ నిఖిల్ మైరెడ్డిది ఏపీలోని కడప జిల్లా కాగా.. మృతుడు రమేష్‌ది హైదరాబాద్ స్వస్థలం. నిహారిక యాదాద్రి జిల్లాకు చెందిన వారిగా తెలిసింది. ఆస్తి కోసమే ఈ దారుణానికి ఒడిగట్టినట్లు భార్య ఒప్పుకున్నట్లు సమాచారం.

## రాష్ట్రంలో అరాచక పాలన

### మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

**ప్రజాభూమి ప్రతినిధి,హైదరాబాద్ :**
బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇంటిపై పోలీసులు దౌర్జన్యంగా దాడి చేయడాన్ని మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఖండించారు. కారణం, వారెంట్ లేకుండా ఎలా సోదాలు చేస్తారని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీ నేత ఇంటిపై పోలీసులు దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఎక్కడో ఏదో జరిగితే కేటీఆర్‌కు సంబంధమేంటని నిలదీశారు. సీఎం రేవంత్ రెడ్డి సోదరులపై చాలా ఆరోపణలు వస్తున్నాయని జగదీశ్‌రెడ్డి అన్నారు. రేవంత్ సోదరుల ఇళ్లపై ఇలాగే చేసే దమ్ముందా అని పోలీసులను ప్రశ్నించారు. స్వయంగా పోలీసులే రేవంత్ రెడ్డి తమ్ముడితో సెటిల్ చేసుకోమని బాధితులకు చెబుతున్నారని అన్నారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి డ్రామాలు ఆడుతున్నాయని జగదీశ్‌రెడ్డి విమర్శించారు. పై నుంచి మోదీ, ఆదానీలో రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. నిజాం కాలంలో కూడా ఇంతలా దుర్మార్గం లేదని అన్నారు. చిల్లర దాడులు తమను భయపెట్టలేవని జగదీశ్ రెడ్డి అన్నారు. తమకు అరెస్టులు కొత్త కాదని తెలిపారు. ఎఫ్ఐఆర్, సెర్చ్ వారెంట్ లేకుండా సోదాలు ఎలా చేస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల్లో వస్తున్న వ్యతిరేకతను కప్పిపుచ్చుకునేందుకే ఇలాంటి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్ష నేతగా ప్రజల్లో కేటీఆర్‌కి వస్తున్న ఆదరణ తట్టుకోలేకే దాడులు చేస్తున్నారని విమర్శించారు. ప్రజా గొంతుకైన కేటీఆర్‌కి సమాధానం చెప్పలేక రేవంత్ రెడ్డి చిల్లర వేషాలు వేస్తున్నారని అన్నారు. మంత్రి పొంగులేటి ఇంట్లో విదేశీ వాచీల వ్యవహారం ఎటుపోయిందని జగదీశ్ రెడ్డి ప్రశ్నించారు. మంత్రుల ఇళ్లలో సోదాలు చేస్తే మీరు అనుకున్నవి దొరుకుతాయని అన్నారు. ఎన్ని కుట్రలు చేసినా తమ ప్రజా పోరాటం ఆగదని స్పష్టం చేశారు. కేటీఆర్‌ను ప్రజలే రక్షించుకుంటారని అన్నారు. సెక్యూరిటీ లేకుండా వస్తే కేటీఆర్, రేవంత్ రెడ్డిలో ఎవరికి ఎంత ఛరీష్మా ఉందో తెలుస్తుందని అన్నారు. తెలంగాణలో గృహ ప్రవేశానికి దావత్ జరగడం సర్వ సాధారణమని జగదీశ్ రెడ్డి తెలిపారు. మంత్రులే పట్టపగలు తాగి తిరుగుతున్నారని.. వారికి పరీక్షలు చేస్తారా అని ప్రశ్నించారు. లేనివి ఉన్నట్టు సృష్టించి కేసులు బనాయించాలని చూస్తున్నారని మండిపడ్డారు. మీరు ఎంత దుర్మార్గానికి దిగజారినా.. కేటీఆర్ ఇమేజ్ పెరుగుతుంది తప్ప తగ్గదని స్పష్టం చేశారు. చట్ట పరిధిలో పనిచేయకపోతే డీజీపీ సమాధానం చెప్పాల్సి ఉంటుందని అన్నారు. తప్పకుండా తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కాంగ్రెస్ చెప్పినట్లు కాకుండా పోలీసులంతా చట్ట పరిధిలో పనిచేయాలని హితవు పలికారు. రౌడీల్లాగా చట్టవిరుద్ధంగా పోలీసులు వస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనుమతి లేకుండా రావడాన్ని ఎలా అర్థం చేసుకోవాలని ప్రశ్నించారు. వెంటనే సోదాలు అపి పోలీసులు వెనక్కి రావాలని.. దాడులు ఇలాగే కొనసాగితే పోలీసులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



# ఫోన్ భద్రంగా..



స్మార్ట్‌ఫోన్లు ఇప్పుడు వ్యక్తిగత ఆస్తులు! పాస్‌వర్డ్‌లు, ఈమెయిళ్లు, బ్యాంకు వివరాల వంటి విలువైన సమాచారం మొత్తం వీటిల్లోనే స్టోర్ చేసుకుంటున్నాం మరి. ఇంతటి కీలకమైన ఫోన్లను భద్రంగా కాపాడుకోవద్దూ! మనలో చాలామంది ఆండ్రాయిడ్ ఫోన్లనే ఎక్కువగా వాడుతుంటారు. వీటి రక్షణ కోసం తీసుకోవాల్సిన కొన్ని జాగ్రత్తల గురించి తెలుసుకుందాం.

**దగ్గరే ఉంచుకోవాలి**

ఫోన్‌ను సురక్షితంగా ఉంచుకోవటానికి అత్యుత్తమైన మార్గం దగ్గరే పెట్టుకోవటం. హోటళ్లకు వెళ్లినప్పుడు పర్సును టేబుల్ మీద పెట్టం కదా. అలాగే బయటకు వెళ్లినప్పుడు ఫోన్‌ను కూడా ఎక్కడ పడితే అక్కడ పెట్టొద్దు. వాడనప్పుడు జేబులో గానీ చేతి సంచీలో గానీ పెట్టుకోవాలి. రద్దీ ప్రాంతాల్లో తిరుగుతున్నప్పుడు ఫోన్ మీద ఓ కన్నేసి ఉంచాలి. చవక ఫోన్ అయినా కూడా దీన్ని మరవరాదు. ఒకసారి ఫోన్ పోయిందంటే దానిలోని వివరాలు ఇతరులకు చిక్కినట్టే. ఇది గోప్యతకు భంగం కలిగిస్తుందని మరవరాదు.

**యూజర్ ప్రొఫైల్ సెట్**

కుటుంబసభ్యులో, స్నేహితులో.. ఇతరులెవరి చేతికి ఫోన్ ఇస్తున్నా యూజర్ ప్రొఫైల్ ఆప్షన్ ఎంచుకోవటం మంచిది. ఇది ప్రతి ఒక్కరికీ తమదైన భద్రత కల్పిస్తుంది. దీన్ని సెట్ చేసుకుంటే కొత్త యూజర్‌ను యాడ్ చేసుకొని ఫోన్‌ను వారికి ఇవ్వచ్చు. వారి ఈమెయిల్ ఖాతా, యాప్స్, ఫొటో స్టోర్ విడిగా ఉంటాయి. ఇలా ఇద్దరి వ్యక్తిగత వివరాలు భద్రంగా ఉంటాయి. ఒకవేళ కొద్ది నిమిషాల వరకే ఎవరికైనా ఫోన్ ఇస్తున్నట్టయితే గెస్ట్ ప్రొఫైల్‌ను సెట్ చేసుకోవాలి. దీని ద్వారా ఆ సమయం మేరకు ఖాతాను భద్రంగా ఉంచుకోవచ్చు. మొత్తం వ్యక్తిగత డేటా వారి కంటపడకుండా చూసుకోవచ్చు. సెటింగ్స్ ద్వారా సిస్టమ్‌లోకి వెళ్లి.. మల్టిపుల్ యూజర్స్ బటన్‌ను ఆన్ చేసుకోవాలి. అనంతరం యాడ్ యూజర్‌ను ఎంచుకొని, ఒకే మీద ట్యాప్ చేయాలి. కొత్త యూజర్‌కు పేరు పెట్టుకోవాలి. అవసరమైతే ఫొటో జత చేసుకోవచ్చు. ఎవరికైనా ఫోన్ ఇచ్చేటప్పుడు స్విచ్ యూజర్ మీద ట్యాప్ చేసి సెటప్ నౌ ఎంచుకుంటే సరి. కొన్ని ఫోన్లలో ఈ సెటింగ్ విధానం భిన్నంగా ఉండొచ్చు.

**యాప్స్ లాకప్**

స్క్రీన్ లాక్ చేసుకోవటమే కాకుండా ముఖ్యమైన యాప్‌లను విడివిడిగా లాక్ చేసుకోవటమూ ముఖ్యమే. ఎవరైనా పాస్‌వర్డ్ తెలుసుకొని ఫోన్‌ను ఓపెన్ చేసినా యాప్‌లను ఓపెన్ చేయకుండా ఇది కాపాడుతుంది. ఇందుకోసం ఉచితంగా అందుబాటులో ఉండే యాప్ లాక్ వంటి సాధనాల సాయమూ తీసుకోవచ్చు. అన్నీ కాకపోయినా ఈమెయిల్, ఫైల్ మేనేజర్ వంటి రహస్య సమాచారంతో కూడిన యాప్‌లను లాక్ చేసుకుంటే నిశ్చింతగా ఉండొచ్చు. కొన్ని పరికరాల్లో ప్రత్యేకించి లాక్డ్ ఏరియా వంటి ఫీచర్లూ ఉంటాయి. వీటిల్లో ముఖ్యమైన యాప్‌లను భద్రపరచుకోవచ్చు. అదనంగా మరో సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన అవసరముండదు.

**ఫైండ్ మై డివైస్**

పొరపాటున ఫోన్ పోయినట్టయితే ఇది బాగా ఉపయోగపడుతుంది. ముందుగా సెటింగ్స్‌లోకి వెళ్లి, సెక్యూరిటీ ఆప్షన్ ద్వారా ప్రైవసీలోకి వెళ్లాలి. ఫైండ్ మై డివైస్‌ను ఆన్ చేయాలి. చాలా ఫోన్లలో ఇది ఆఫ్ చేసి ఉంటుంది. దీని కింద ఫైండ్ మై డివైస్, వెబ్, గూగుల్ అనే ఆప్షన్లు కనిపిస్తాయి. ఒకవేళ ఫైండ్ మై డివైస్ ఫోన్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోనట్టయితే ప్లే స్టోర్‌లోకి వెళ్లి డౌన్‌లోడ్ చేసుకోవాలి. దీన్ని ఇన్‌స్టాల్ చేసుకున్నాక ఓపెన్ చేస్తే గూగుల్ మ్యాప్ మాదిరిగా కనిపిస్తుంది. ఇది పనిచేయాలంటే ఫోన్‌లో లొకేషన్ ఆన్ చేసి ఉంచాలి. అప్పుడే మ్యాప్‌లో ఫోన్ ఉన్నచోటు కనిపిస్తుంది. ఇందులో ప్లే సౌండ్, సెక్యూర్ డివైస్, ఎరేజ్ డివైస్ అనే మూడు ఆప్షన్లు ఉంటాయి. వీటిల్లో ఎరేజ్ డివైస్ బూడిద రంగులో ఉంటుంది. ఎందుకంటే దీన్ని అదే పరికరం నుంచి ఉపయోగించుకోలేం. వెబ్ లేదా ఇతర పరికరం ద్వారానే ఎరేజ్ చేయటానికి వీలుంటుంది.

ఫోన్ కనిపించనప్పుడు లేదా ఎవరైనా దొంగిలించినప్పుడు వెబ్ ఇంటర్‌ఫేస్‌తో గుర్తించొచ్చు. ముందుగా https://www.google.com/android/find లోకి వెళ్లాలి. గూగుల్ ఖాతాలోకి సైన్ ఇన్ అయ్యాక ఎడమ వైపున మన ఫోన్ కనిపిస్తుంది. ప్లే సౌండ్‌ను ఎంచుకుంటే ఐదు నిమిషాల సేపు ఫోన్ రింగ్ అవుతుంది. సైలెంట్ మోడ్‌లో ఉన్నా, స్విఛాఫ్ అయినా కూడా ఫోన్ రింగ్ అవుతుంది. ఫోన్ దొరికినవారిని హెచ్చరించేందుకు మెసేజ్ కూడా పంపించొచ్చు. స్క్రీన్ లాక్ అయినా వారికి మెసేజ్ కనిపిస్తుంది. ఫోన్‌ను లాక్ చేయాలనుకుంటే 'సెక్యూర్ డివైస్' మీద క్లిక్ చేసి, గూగుల్ ఖాతా నుంచి సైన్ అవుట్ కావాలి. ఇక 'ఎరేజ్ డివైస్' ఆప్షన్‌తో ఫోన్‌లోని సమాచారాన్నంతా డిలిట్ చేయొచ్చు. ఇందుకోసం మళ్లీ సైన్ ఇన్ కావాల్సి ఉంటుంది. ఒకసారి సమాచారం ఎరేజ్ అయితే ఇక ఎప్పటికీ ఫోన్ ఎక్కడున్నదీ గుర్తించలేం. ఒకవేళ కంప్యూటర్ అందుబాటులోకి లేకపోతే ఇతర ఆండ్రాయిడ్ పరికరంతోనూ ఫైండ్ మై డివైస్ యాప్‌లోకి సైన్‌ఇన్ అయ్యి కూడా ఫోన్ ఉన్న చోటును గుర్తించొచ్చు.
సామ్‌సంగ్ గెలాక్సీ వంటి కొన్ని ఫోన్లలో ఫైండ్ మై డివైస్‌తో పాటు అదనంగా ఫైండ్ మై మొబైల్ ఆప్షన్ సైతం ఉంటుంది.

గూగుల్‌తో యాప్స్ ధ్రువీకరణ

గూగుల్ ప్లే స్టోర్‌లో ఉన్న అన్ని యాప్‌లను గూగుల్ తనిఖీ చేస్తుంది, ధ్రువీకరిస్తుంది. అయితే కొన్నిసార్లు అధికార స్టోర్‌ల నుంచి కాకుండా ఇతర సోర్స్ నుంచి యాప్‌లను ఇన్‌స్టాల్ చేసుకోవాల్సిన పరిస్థితి తలెత్తొచ్చు. ఇలాంటప్పుడు యాప్ వెరిఫికేషన్‌ను ఆన్ చేసుకుంటే ఇన్‌స్టాల్ చేసుకునే యాప్‌లను స్కాన్ చేస్తుంది. వాటిల్లో మాల్వేర్లుంటే హెచ్చరిస్తుంది. ఇందుకోసం సెటింగ్స్ ద్వారా సెక్యూరిటీ విభాగంలోకి వెళ్లి స్కాన్ డివైస్ ఫర్ సెక్యూరిటీ థ్రెట్స్‌ను ఎనేబుల్ చేసుకోవాలి.

**సెక్యూరిటీ యాప్ ఇన్‌స్టాల్**

సహజంగానే ఆండ్రాయిడ్ పరికరాల్లో బోలెడన్ని సెక్యూరిటీ టూల్స్ ఉంటాయి. అయినప్పటికీ థర్డ్ పార్టీ సెక్యూరిటీ లేదా యాంటీవైరస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవటం మంచిది. అయితే 360 సెక్యూరిటీ, అవాస్ట్ యాంటీవైరస్ అండ్ సెక్యూరిటీ, లుకవుట్ మొబైల్ సెక్యూరిటీ వంటి విశ్వసనీయ యాప్‌లనే ఎంచుకోవాలని మరవొద్దు. ఇలాంటి భద్రమైన యాప్‌లు వైరస్‌లు, మాల్వేర్లను స్కాన్ చేయటమే కాకుండా అంతర్జాలాన్ని చూస్తున్నప్పుడు బ్రౌజర్లనూ స్కాన్ చేస్తాయి. టూల్స్ వేగాన్నీ పెంచుతాయి. బాగా పనిచేసే సెక్యూరిటీ యాప్‌ను ఎంచుకొని, ఇన్‌స్టాల్ చేసుకోవాలి.



**డేటా ఎన్‌క్రిప్షన్**


పరికరంలో డేటాను ఎన్‌క్రిప్షన్ చేసుకుంటే ఫోన్ లేదా ట్యాబ్లెట్‌ను ఎవరైనా దొంగిలించినా భద్రంగా కాపాడుకోవచ్చు. ఇది డేటాను ఇతరులు చదవటానికి వీల్లేని రహస్యలిపిలోకి మార్చేస్తుంది. పాస్‌వర్డ్‌లాంటి విశ్వసనీయ మార్గాలతో తప్ప వాటిని చదవటానికి, చూడటానికి వీలుండదు. ఖాతా, యాప్ వివరాలు, మ్యూజిక్, ఇతర మీడియా, డౌన్‌లోడ్ సమాచారం వంటి ఆండ్రాయిడ్ పరికరంలోని మొత్తం డేటాను ఎన్‌క్రిప్ట్ చేసుకోవచ్చు. సెటింగ్స్‌లోని సెక్యూరిటీ మెనూ ద్వారా ఎన్‌క్రిప్షన్ మోడ్‌ను జతచేసుకోవచ్చు. దీన్ని ఎనేబుల్ చేసుకోవటం కొన్ని ఫోన్లలో వేరేగా ఉండొచ్చు.

**తరచూ బ్యాకప్**

ఆండ్రాయిడ్ సెక్యూరిటీ సెటప్‌లో భాగంగా తరచూ బ్యాకప్ చేసుకోవటం కీలకమైన విషయం. ఎప్పుడో చేసుకున్న బ్యాకప్‌లు పరికరానికి పూర్తి భద్రత కల్పించలేవు. ఎప్పటికప్పుడు బ్యాకప్ చేసుకోకపోతే రికవర్ చేసుకునే సమయంలో కొంత సమాచారాన్ని కోల్పోయే ప్రమాదముంది. ఆటోమేటిక్ బ్యాకప్ ఫీచర్‌తో దీన్ని తేలికగానే సెట్ చేసుకోవచ్చు. సెటింగ్స్‌లోకి వెళ్లి, బ్యాకప్ మై అకౌంట్‌ను ఎంచుకుంటే చాలు.

**అన్‌సెక్యూర్డ్ నెట్‌వర్క్‌ల వాడొద్దు**

ఎట్టి పరిస్థితుల్లోనూ విశ్వసనీయం కాని నెట్‌వర్క్‌లకు కనెక్ట్ కావొద్దు. స్మార్ట్‌ఫోన్లు, ట్యాబ్లెట్లతో వ్యాపారం చేసేవారికిది మరింత ముఖ్యం. హోటళ్ల వంటి చోట్ల తరచూ పనిచేసేవారు ఇంటర్నెట్‌కు కనెక్ట్ కావాల్సి వస్తే పాస్‌వర్డ్‌తో కూడిన నెట్‌వర్క్‌లనే ఎంచుకోవాలి. పాస్‌వర్డ్‌లు లేని వై ఫైతో కనెక్ట్ అయితే రహస్య సమాచారాన్ని పంపటం, అందుకోవటం చేయొద్దు.తెరకు తాళం అన్నింటికన్నా ముందుగా సెట్ చేసుకోవాల్సింది స్క్రీన్ లాక్. ఇంటికి తాళం వేసినట్టుగా తెరను లాక్ చేసుకుంటే ఇతరులెవరూ తెరవటానికి వీలుండదు. ప్యాటర్న్, పిన్ దేనితోనైనా స్క్రీన్ లాక్ చేసుకోవచ్చు. పిన్‌తో లాక్ చేసుకోవటం సురక్షితమైన పద్ధతే గానీ ప్యాటరన్‌తోనైతే త్వరగా ఫోన్‌ను అన్‌లాక్ చేయొచ్చు. దీన్ని గుర్తుంచుకోవటమూ తేలికే. అయితే ఇతరులెవరూ ఊహించలేని సంక్లిష్టమైన ప్యాటర్న్ సెట్ చేసుకోవాలి. అధునాతన ఆండ్రాయిడ్ సెక్యూరిటీ ఫీచర్లు ఇప్పుడు ఫోన్‌ను సెట్ చేసుకోవటానికి ముందే స్క్రీన్ లాక్‌ను సూచిస్తున్నాయి కూడా. కాబట్టి దీన్ని సమర్థవంతంగా వాడుకుంటే ఫోన్ భద్రత విషయంలో తొలి అడుగు పడినట్టే.



# యాంటీబయాటిక్ ఏఐ

కృత్రిమ మేధ (ఏఐ) వాడకం గణనీయంగా పెరుగుతోంది. కంటెంట్ డవలప్‌మెంట్, ఈమెయిల్ ప్రూఫ్‌రీడింగ్ దగ్గరి నుంచి స్వయం చోదక వాహనాల వరకూ ఎన్నింటికో ఉపయోగపడుతోంది. దీని సాయంతో మెరుగైన, తక్కువ దుష్ప్రభావాలు చూపే యాంటీ బయాటిక్ మందులను తయారు చేయటం మీదా పరిశోధకులు దృష్టి సారిస్తున్నారు. కెనడాలోని యూనివర్సిటీ ఆఫ్ మనిటోబా పరిశోధకులు ఏఐ టెక్నాలజీలో ఒక భాగమైన ఎక్స్‌ప్లెయినేబుల్ ఏఐ (ఎక్స్‌ఏఐ)ని ఇందుకు ఎంచుకుంటున్నారు. ప్రిడిక్టివ్ ఏఐ మోడళ్లను పరీక్షించటానికి మేధావులు వాడుకునే దీన్ని సరికొత్త అవసరాల దిశగా మళ్లిస్తున్నారు. రకరకాల సందర్భాలకు ఎక్స్‌ఏఐని వర్తింపజేస్తున్నప్పటికీ మనిటోబా యూనివర్సిటీ పరిశోధకులు యాంటీ బయాటిక్ మందుల తయారీకి వాడుకుంటున్నారు.
ఏఐ దాదాపు సర్వశక్తిమంతమైనదే అయినా చాలా మోడళ్లు 'బ్లాక్ బాక్సు'ల మాదిరిగా వ్యవహరిస్తాయి. నిర్ణయాలు తీసుకోవటం పారదర్శకంగా ఉండదు. ఇది మందుల ఆవిష్కరణ వంటి కీలక రంగాల్లో అపనమ్మకానికి దారితీస్తుంది. దీన్ని అధిగమించటానికి పరిశోధకుల బృందం ఎక్స్‌ఏఐ సాయంతో ఏఐ డ్రగ్ డిస్కవరీ నమూనాలకు శిక్షణ ఇచ్చింది. ముఖ్యంగా వినూత్న యాంటీబయాటిక్ క్యాండిడేట్లను గుర్తించేందుకు తర్ఫీదు ఇచ్చింది. రోజురోజుకీ బ్యాక్టీరియా యాంటీబయాటిక్ మందులను తట్టుకునే సామర్థ్యాన్ని పెంపొందించుకుంటున్న నేపథ్యంలో ఇలాంటి ప్రిడిక్టివ్ ఏఐ నమూనాలు తప్పనిసరి అవసరంగా మారాయి. 'ఔషధ ఆవిష్కరణ, రసాయన శాస్త్ర రంగాల్లో భవిష్యత్తు అంతా ఏఐదే. ఇది ఎవరో ఒకరికి ఆవిష్కరణకు పునాది వేయటానికి ఉపయోగపడుతుంది. మేం కూడా అదే చేస్తున్నాం' అని పరిశోధకులు చెబుతున్నారు.
శరీరం మీద మందులు చూపే ప్రభావాలను అంచనా వేయటానికి శాస్త్రవేత్తలు ముందుగా ఏఐ మోడళ్లకు మందుల రసాయన సమాచారాన్ని అందించారు. అనంతరం ఎక్స్‌ఏఐ మోడళ్లను పురమాయించారు. ఏఐ మోడళ్లు వేసిన అంచనాల వెనక మాలిక్యులర్ గుణగణాలను కచ్చితంగా పరీక్షించే పనిని వీటికి అప్పగించారు. మానవ రసాయన శాస్త్రవేత్తలు గుర్తించే అవకాశం లేని అంశాలనూ ఎక్స్‌ఏఐ పట్టుకోవటం విచిత్రం. ఉదాహరణకు పెన్సిలిన్‌లోని కోర్ నిర్మాణాల కన్నా నాన్ కోర్ నిర్మాణాలే ముఖ్యమని గుర్తించటం గమనార్హం. అంచనా వేసిన యాంటీబయాటిక్ కాంపౌండ్స్‌ను పరీక్షించటానికి పరిశోధకులు మైక్రోబయాలజీ ప్రయోగశాలల సాయమూ తీసుకున్నారు. ఔషధ ఆవిష్కరణలో ఏఐ అపనమ్మకం కలిగించేదే అయినప్పటికీ దీన్ని ఆమోదించే అవకాశమే ఎక్కువని పరిశోధకులు భావిస్తున్నారు. తనను తాను విశ్లేషించుకోవాలని తిరిగి ఏఐకే చెబితే మెరుగైన ఫలితాలు రాబట్టొచ్చనీ ఆశిస్తున్నారు. ఈ అధ్యయన ఫలితాలు అమెరికన్ కెమికల్ సొసైటీ ఫాల్ 2024లో సమర్పించనున్నారు.

# నవ్వు శాస్త్రం

నవ్వటం ఒక భోగం! అతిశయోక్తిలా అనిపించినా ఇది నిజం. ఇప్పుడు చాలామంది జీవితాల్లో నవ్వటమనేది కనుమరుగవుతోంది. రోజుకు ఒక్కసారైనా నవ్వనివారు ఎందరో. ఇది లోపిస్తే శారీరక, మానసిక ఆరోగ్యాలు కుంటుపడటం ఖాయం. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఇటీవల జపాన్‌లోని ఒక స్థానిక ప్రభుత్వం రోజుకు ఒకసారైనా నవ్వాలని ప్రజలను ఆదేశిస్తూ ఏకంగా చట్టాన్నే చేసింది. నిజానికి నవ్వు ఒక భావోద్వేగమే. దీన్ని సైన్స్ కూడా బలపరుస్తుంది. దీంతో శారీరక, భావోద్వేగ, మానసిక ఆరోగ్యం ముడిపడి ఉన్నాయని అధ్యయనాలు ఘోషిస్తున్నాయి. మానవ సంబంధాలు సైతం దీంతో ముడిపడినవే. మరి నవ్వు వెనకాల ఉన్న శాస్త్రీయ సంగతులేంటో తెలుసుకుందామా.

నవ్వు, హాస్యం అన్ని సమాజాల్లోనూ ఉంది. మనుషులే కాదు.. కోతులు, ఎలుకల వంటి జంతువులూ నవ్వుతాయి. నవ్వు విషయంలో పరిణామక్రమం పాత్ర ఉందనటానికిదే నిదర్శనం. పరిణామక్రమంలో భాగంగా సామాజిక బంధం రూపంలో జంతువుల్లో నవ్వు పుట్టుకొచ్చిందంటారు. ఆనందం, సంతోషం వ్యక్తం చేయటానికి అవి దీన్ని వాడుకుంటూ వస్తున్నాయి. చక్కిలిగిలి పెట్టినప్పుడు, శారీరకంగా సన్నిహితంగా ఉన్నప్పుడు కూడా చాలా క్షీరదాలు నవ్వుతాయి. మనమూ చక్కిలిగిలి పెట్టినప్పుడు నవ్వకుండా ఉండలేం. అయితే మనుషులు నవ్వటానికి శారీరక ప్రేరణేమీ అవసరం లేదు. కబుర్లు, సందేశాలకు సంకేతంగా మనుషుల్లో నవ్వు పరిణామం చెందిందని భావిస్తుంటారు. వేలాది ఏళ్ల క్రితం ఒక సమూహంగా కలిసి ఉండటానికి ఇది జిగురు మాదిరిగా పనిచేసిందని చెప్పుకోవచ్చు. 'అంతా బాగానే ఉంది, ప్రశాంతంగా ఉండొచ్చని.. చుట్టుపక్కల జరుగుతున్న విషయాలకు ఆందోళన చెందాల్సిన అవసరం లేద'ని సమూహానికి తెలియజేసే బాహ్య సంకేతంగా నవ్వును వాడుకున్నారు. ఇలా మనిషి సమూహాలుగా జీవిస్తున్న రోజుల్లో మనుగడ సాగించటానికి నవ్వు గొప్ప సాధనంగా ఉపయోగపడింది. శతాబ్దాలుగా మెదడు ఈ అనుసంధానాలను కాపాడుకుంటూ వస్తోంది. కాబట్టే ఇప్పటికీ ఆహ్లాద, వినోద, ఆశ్చర్య, అద్భుత విషయాల గురించి వినగానే నవ్వుకుంటున్నాం. నవ్వు సార్వత్రికం, విశ్వవ్యాప్తం. అలాగని ఒక అంశం మీద అన్ని సంస్కృతుల వాళ్లూ ఒకేలా నవ్వుతారని చెప్పలేం.

**ఆదిమ శబ్దం**

ఓస్ నవ్వే కదాని అనిపించినా ఇదో సంక్లిష్ట ప్రక్రియ. మెదడు, శరీరంలోని చాలా భాగాలు ఇందులో పాలు పంచుకుంటాయి. మనకు అందే శబ్దాలు, చప్పుళ్ల సమాచారంతో కూడిన వేర్వేరు అంశాలను మెదడులో నుదుటి వద్ద ఉండే భాగం (ఫ్రొంటల్ లోబ్) గ్రహించి, అంచనా వేస్తుంది. తర్వాత అది వినోద భరితమైనదా? కాదా? అని నిర్ణయిస్తుంది. ఇది ఆనందం, భయం వంటి భావాలను పర్యవేక్షించే వ్యవస్థ (లింబిక్ సిస్టమ్)లో భావోద్వేగ ప్రతిస్పందనలను ప్రేరేపిస్తుంది. తర్వాత శరీర ప్రతిస్పందనలను నియంత్రించే భాగం (మోటార్ కార్టెక్స్) ఉత్తేజితమవుతుంది. దీంతో పెదవులు సాచి చిరునవ్వు నవ్వటమో, బిగ్గరగా పగలబడి నవ్వటమో చేస్తాం. నవ్వటం మొదలు పెట్టినప్పుడు పక్కటెముకల గూడు చాలా వేగంగా, చాలా ఎక్కువగా సంకోచిస్తుంది. దీంతో హ్హా.. హ్హా.. హ్హా.. అనే శబ్దంతో ఒక్కపెట్టున గాలి బయటకు వస్తుంది. చప్పుడు చేయటానికి ఇదో అతి పురాతనమైన విధానం. నవ్వినప్పుడు మెదడు లోపల ప్రసారమయ్యే ఎండార్ఫిన్లలో మార్పులు ఏర్పడతాయి. ఇది నొప్పిని తగ్గించే భావనను కలిగిస్తుంది. నవ్వుతున్నకొద్దీ అడ్రినల్ హార్మోన్ మోతాదులు తగ్గుతూ వస్తాయి. క్రమంగా ఒత్తిడి కారక కార్టిజోల్ హార్మోన్ స్థాయులూ పడిపోతాయి. ఫలితంగా మానసిక స్థితి మెరుగవుతుంది. ఒత్తిడికి అతిగా స్పందించకుండా నవ్వు అడ్డు పడుతుంది. ఆహ్లాదకరమైన భావన కలిగిస్తుంది. అందుకేనేమో మనిషి కావాలనే హాస్యాన్ని పండించుకోవటం నేర్చుకున్నాడు.

**అసంకల్పితం, సంకల్పితం**

ఎవరైనా జోక్ వేసినప్పుడో, హాస్య భరిత సన్నివేశాలు చూస్తున్నప్పుడో అప్పటికప్పుడు, హఠాత్తుగా, అసంకల్పితంగా నవ్వుతుంటాం కదా. ఇలాంటి భావోద్వేగంతో కూడిన నవ్వు స్వచ్ఛమైన, నిజమైన ఆనందానికి సంకేతం. ఇది పిల్లల్లో లేదా చక్కిలిగిలి పెట్టినప్పుడో చూస్తుంటాం. దీన్ని డూషెన్ నవ్వు అని పిలుచుకుంటారు. దీనికి భిన్నమైంది నాన్ డూషేన్ నవ్వు. ఇది తెచ్చిపెట్టుకునే నవ్వు. ఇందులో తక్షణ భావోద్వేగం తక్కువ. సామాజిక వ్యూహంగా దీన్ని వాడుకుంటుంటారు. ఉదాహరణకు మాట్లాడేటప్పుడు విరామం కోసం నవ్వటం. మాటలు వినోదాత్మకంగా లేకపోయినా దీన్ని ప్రయోగిస్తుంటారు. ఈ రెండు రకాల నవ్వుల్లో ముఖ కవళికలు, నాడీ సమాచార మార్గాలు వేర్వేరుగానూ ఉంటాయి. అసంకల్పిత నవ్వు మస్తిష్క మూలం, లింబిక్ వ్యవస్థ నుంచి.. కావాలని నవ్వటం ఫ్రొంటల్ లోబ్ నుంచి పుట్టుకొస్తాయి. హఠాత్తుగా వచ్చే నవ్వుకు మూలం ఆదిమ మానవుల ఆటలు. ఇలాంటి నవ్వులో వచ్చే శబ్దం జంతువుల ఆరుపులనూ తలపిస్తుండటం గమనార్హం. కావాలని నవ్వటం తర్వాత కాలంలో నలుగురితో చర్చించటం, అప్రతిష్ఠ పాలు చేయటం, ఎగతాళి చేయటంతో అబ్బింది.

**వినోదం ఎందుకు కలుగుతుంది?**

మానసిక నిపుణులు, హాస్య నటులు ప్రయత్నించినప్పటికీ వినోదాన్ని కలిగించే సార్వత్రిక సూత్రాన్ని కనుక్కోలేకపోయారు. కొన్నిసార్లు ఇతరుల దురవస్థ, బాధలను చూసి నవ్వు పుట్టొచ్చు. ఇది అసమంజసంగా, అసంబద్ధంగా అనిపించొచ్చు గానీ అవతలివారి మనసులను నొప్పించని విధంగానే ఉంటుంది. కొన్నిసార్లు కొన్ని శబ్దాలు, పదాలే సహజంగా నవ్వు తెప్పించొచ్చు. నవ్వు అన్నివేళలా నిజమైన భావనలతోనే రాకపోవచ్చు. చుట్టుపక్కల వారికి ప్రదర్శించటానికీ నవ్వాల్సి రావొచ్చు. ఒత్తిడితో కూడిన పరిస్థితులు సద్దుమణగటానికి నవ్వొచ్చు. గంభీర వాతావరణాన్ని తేలిక పరచటానికి జోక్‌లు వేయొచ్చు. అయితే ఇది అన్నిసార్లూ పనిచేస్తుందని చెప్పలేం. అవతలి వ్యక్తులు మనతో కలిసి నవ్వినప్పుడే ఫలిస్తుంది. కొస విరుపు (పంచ్ లైన్) పనిచేయనప్పుడు దాన్ని వేసినవారికిది బాగా అనుభవమే. నవ్వుకు చీకటి కోణమూ ఉంది. అనుచితంగా, అకారణంగా నవ్వటం విషయగ్రహణలో ఏదో తేడా ఉందనటానికి సంకేతం కావొచ్చు. ఇతరుల మాదిరిగా హాస్యానికి స్పందించకపోవటం, అనుచిత సందర్భాల్లో నవ్వటం డిమెన్షియా తొలి లక్షణమని ఒక అధ్యయనం పేర్కొంటోంది మరి.

**దాంపత్య బంధం బలోపేతం**

సామాజిక సంబంధాల విషయంలోనే కాదు.. జీవిత భాగస్వాముల మధ్య బంధంలోనూ నవ్వు జిగురు మాదిరిగా ఉపయోగపడుతుండటం విశేషం. నవ్వుతో దంపతుల మధ్య సన్నిహిత సంబంధం బలోపేతం అవుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా నిర్వహించిన అధ్యయనంలో బయటపడింది. తృప్తి పడిన జంటలు ఎక్కువగా, అసంతృప్తి గల జంటలు తక్కువగా నవ్వుతున్నట్టు వెల్లడైంది. మరో ప్రయోగంలో పరిశోధకులు దంపతులను వారి సంబంధాల్లో ఎదురవుతున్న చిక్కులు, ఇబ్బందుల గురించి చర్చించమని చెప్పారు. వేర్వేరు మానసిక, భావోద్వేగ ప్రతిస్పందనలను పాలీగ్రాఫ్‌తో పరిశీలించారు. ఒత్తిడితో కూడిన అంశాల గురించి మాట్లాడే సమయంలో నవ్వటం వల్ల సానుకూల భావోద్వేగాలు మరింత ఎక్కువగా ఉంటున్నట్టు గుర్తించారు. ఇది వెంటనే ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి భాగస్వాములు తమ మధ్య ఆనందంగా సంబంధాలు కొనసాగించటానికి, ఎక్కువ కాలం కలిసి జీవించటానికి వీలవుతోందనీ పరిశోధకులు వివరిస్తున్నారు. భాగస్వాములు అన్యోన్యంగా, మనసు విప్పి మాట్లాడుకుంటున్నారనటానికి నవ్వు ఒక సంకేతం. ఒత్తిడిని కలగజేసే పరిస్థితుల్లోనూ సంబంధాలను కొనసాగించటానికి, కష్ట సుఖాలను కలబోసుకోవటానికి నవ్వు దోహదం చేస్తోందని చెబుతున్నారు. తృప్తితో కూడిన అనుబంధాలు కొనసాగటానికిది అతి ముఖ్యమైంది కావటం విశేషం.

**అంటువ్యాధిలా..**

ఒంటరిగా ఉన్నప్పటి కన్నా ఇతరులతో కలిసి ఉన్నప్పుడు 30 రెట్లు ఎక్కువగా నవ్వు వస్తుంది. దీన్ని అంటువ్యాధి లాంటిదనీ చెప్పుకోవచ్చు. ఎవరైనా నవ్వుతున్నట్టు వినిపిస్తే నవ్వే అవకాశం ఎక్కువ. మెదడులో ఎండార్ఫిన్లు ప్రసరిస్తున్నప్పుడు హాయి భావన కలుగుతుంది. నవ్వుతున్నప్పుడు లోపలికి ఎక్కువ మొత్తంలో ఆక్సిజన్‌ను తీసుకుంటాం. దీంతో శరీరంలోని కణాలతో పాటు మెదడుకూ మరింత ఎక్కువ ఆక్సిజన్ అందుతుంది. అందువల్ల హాయిగా ఉండటానికి నవ్వును ఒక ఔషధంగా అభివర్ణించినా అతిశయోక్తి కాదు. పైగా ఇది ఉచితం కూడా. ఇతరత్రా ప్రయోజనాలనూ అందించే నవ్వును చులకనగా చూడటం, పనికిరానిదని భావించటం తగదు. నవ్వు పుట్టించే సందర్భాలు ఏవైనా ప్రయోజనాలు మాత్రం ఒకటే. నవ్వుతో కలిగే లాభాలను పొందటానికి హాస్య సినిమాలు, కార్టూన్లు చూడటం, హాస్య కథలు చదవటం వంటివి చేయొచ్చు. కానీ నవ్వుల మూలంగా ఇతరులతో ఏర్పడే సంబంధాలతో ఎక్కువ ప్రయోజనం చేకూరుతుందని తెలుసుకోవాలి.

**లాభాలు ఎన్నెన్నో..**

వ్యక్తిగత, సామాజిక బంధాల్లోనే కాదు.. ఆరోగ్యపరంగానూ నవ్వు చాలా ప్రయోజనాలు చేకూరుస్తుంది.

1. నవ్వుతో శరీరమంతా వదులవుతుంది. మనసారా నవ్విన తర్వాత 45 నిమిషాల వరకూ కండరాలు వదులవుతాయి. నవ్వుతో రోగనిరోధక కణాల సంఖ్య, ఇన్‌ఫెక్షన్లతో పోరాడే యాంటీబాడీల సంఖ్య పెరుగుతుంది. ఫలితంగా జబ్బులను ఎదుర్కొనే శక్తి ఇనుమడిస్తుంది.
2. నవ్వుతో రక్తనాళాల పనితీరు మెరుగవుతుంది. రక్త ప్రసరణ పుంజుకుంటుంది. ఇది గుండెపోటు వంటి జబ్బుల నుంచి కాపాడుతుంది.
3. రోజుకు 1015 నిమిషాల సేపు నవ్వితే సుమారు 40 కేలరీలు ఖర్చవుతున్నట్టు ఒక అధ్యయనం చెబుతోంది. ఇవి ఏడాదిలో దాదాపు 2 కిలోల బరువు తగ్గటంతో సమానం.
4. అంతగా నవ్వనివారితో పోలిస్తే తరచూ నవ్వేవారు ఎక్కువ కాలం జీవిస్తున్నట్టు నార్వేలో నిర్వహించిన అధ్యయనంలో వెల్లడైంది. క్యాన్సర్ బాధితుల్లో దీని ప్రభావం మరిం[illegible] విశేషం.





## నా తల్లిదండ్రుల ఎదుటే ఆ నిర్మాత అవమానించాడు: విద్యాబాలన్

కెరీర్ ఆరంభంలో తాను ఎన్నో సవాళ్లు, రిజెక్షన్స్ ఎదుర్కొన్నానని బాలీవుడ్ నటి విద్యాబాలన్ తెలిపారు. దక్షిణాదికి చెందిన ఒక నిర్మాత తనని అవమానించాడని అన్నారు. ఆయన మాటలకు దాదాపు ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయానని తాజాగా ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ''చక్రం' అనే మలయాళ చిత్రంతో నటిగా ఎంట్రీ ఇచ్చా. మోహన్‌లాల్ హీరో. కెరీర్ ఆరంభంలోనే స్టార్‌హీరోతో సినిమా చేస్తున్నానని తెలిసి చాలా అవకాశాలు నన్ను వరించాయి. అనివార్య కారణాల వల్ల షూటింగ్ దశలోనే 'చక్రం' ఆగిపోయింది. దాంతో మిగిలిన సినిమాల్లో నన్ను తొలగించి వేరే హీరోయిన్స్‌ను పెట్టుకున్నారు. మూడేళ్లపాటు బాధపడ్డా. ఏం జరుగుతుందో అర్థం కాక.. కుంగుబాటుకు లోనయ్యా. ఇంట్లో ప్రతిరోజూ గొడవలు జరుగుతుండేవి. నీ తోటి వాళ్లందరూ సెటిలయ్యారు నువ్వెందుకు ఇక్కడే ఆగిపోయావు. సినిమాలు మనకు సెట్ కావని అమ్మ చెబుతుండేది'' ''కొంతకాలానికి ఒక తమిళ చిత్రంలో అవకాశం వచ్చింది. కొన్నిరోజులు షూట్ చేశా. 'చక్రం' ఆగిపోయిందని తమిళ నిర్మాతకు తెలిసింది. దాంతో ఆయన నా జాతకం చూపించాడు. తమ చిత్రానికి సెట్ కానని తొలగించాడు. విషయం తెలిసి.. నా తల్లిదండ్రులతో ఆయన్ని కలిశా. సినిమా కోసం షూట్ చేసిన కొన్ని సన్నివేశాలు చూపిస్తూ.. 'ఒక్కసారి ఆమె ముఖం చూడండి హీరోయిన్‌లా ఎక్కడైనా కనిపిస్తుందా? డ్యాన్స్ రాదు. యాక్టింగ్ రాదు' అని అవమానించాడు. దాదాపు ఆరు నెలలు అద్దంలో చూసుకోలేకపోయా. నాపై నాకే అసహ్యం వేసింది'' అని విద్యాబాలన్ చెప్పారు. ఆత్మవిశ్వాసం కోల్పోయిన సమయంలో ప్రదీప్ సర్కార్ తనకు ఎంతో అండగా నిలిచారని.. యాడ్‌షూట్స్, సినిమాల్లో అవకాశం ఇచ్చారన్నారు.

## ఆ హీరో సినిమాలో ఛాన్స్ కోసం రిక్వెస్ట్ చేశా: 'రియా' ఫేమ్ ఇషా

ఇటీవల ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారిన పేరు ఇది. 'మత్తు వదలరా 2'లో 'రియా'గా నటించిన సోషల్‌మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఇషా యాదవ్.. ఆ చిత్రంతో ఒక్కసారిగా ఫేమ్ సొంతం చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆమె ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తనకు ఇష్టమైన హీరో గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఆ హీరో సినిమాలో చిన్న రోల్ వచ్చినా చాలన్నారు.

''చిన్నప్పటి నుంచి నాకు రామ్‌చరణ్ అంటే ఎంతో ఇష్టం. 'బెట్టింగ్ రాజా' (తెలుగులో 'రచ్చ') సినిమా చూసి ఆయనకు వీరాభిమానిని అయిపోయా. ఆయన యాక్టింగ్, డ్యాన్స్ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన సినిమాలో నటించాలని ఉంది. 'మత్తు వదలరా 2' చేస్తున్నప్పుడు ఇదే విషయాన్ని మైత్రి మూవీ మేకర్స్ టీమ్‌లోని చెర్రీ సర్‌కు చెప్పా. రామ్‌చరణ్ సినిమాలో ఏ రోల్ ఇచ్చినా పర్వాలేదు నేను చేస్తానని రిక్వెస్ట్ చేశా'' అని ఆమె చెప్పారు. దిల్లీకి చెందిన రియా.. సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్‌గా యువతకు చేరువయ్యారు. షార్ట్ ఫిల్మ్‌స్‌లో యాక్ట్ చేశారు. 'మత్తు వదలరా 2'తో నటిగా ఫేమ్ అందుకున్నారు. మరోవైపు, రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ ఛేంజర్' పనుల్లో బిజీగా ఉన్నారు. త్వరలో ఆయన 'ఆర్‌సీ 16' సెట్‌లోకి అడుగుపెట్టనున్నారు. ఇది పూర్తయ్యాక సుకుమార్ దర్శకత్వంలో మైత్రి మూవీ మేకర్స్ పతాకంపై సినిమా చేయనున్నారు. RC 17గా ఇది ప్రచారంలో ఉంది.



## కామెంట్స్ చూస్తే 'రోలెక్స్'లా మారేవాడిని

సూర్య హీరోగా శివ దర్శకత్వం వహించిన చిత్రం 'కంగువా'. భారీ బడ్జెట్‌తో రూపుదిద్దుకున్న ఈ సినిమా నవంబర్ 14న విడుదల కానుంది. శనివారం చెన్నైలో 'కంగువా' ఆడియో రిలీజ్ చేశారు. అభిమానుల సమక్షంలో జరిగిన ఈ వేడుకలో సూర్య ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. కెరీర్ పరంగా ఎత్తుపల్లాలు చూస్తున్నందుకు తాను ఏమాత్రం బాధపడటం లేదన్నారు. వైఫల్యాలను అనుభవిస్తేనే సక్సెస్‌ను ఎంజాయ్ చేయగలమని అన్నారు.

''సుమారు ఐదేళ్ల క్రితం మరోలా ఉండేవాడిని. సోషల్‌మీడియా వేదికగా ఎవరైనా నెగటివ్ కామెంట్స్ చేస్తే.. వాటిని చూసినప్పుడు 'రోలెక్స్' (విక్రమ్‌లో తాను పోషించిన పాత్ర)లా మారిపోయేవాడిని. బాగా కోపం వచ్చేది. కానీ, క్షమించడం ఎంతో అందమైన విషయమని దర్శకుడు శివ వల్ల తెలిసింది. ఎవరైనా ద్వేషించినా..

మీరు ప్రేమను మాత్రమే పంచండి. ప్రతికూల కామెంట్స్‌కు రిప్లైలు ఇచ్చుకుంటూ మీ సమయాన్ని వృథా చేసుకోవద్దు'' అని హితవు పలికారు. నిర్మాణ సంస్థ గురించి మాట్లాడుతూ.. ''గ్రీన్ స్టూడియోస్ నాకు సొంత ఇంటితో సమానం. జ్ఞానవేల్‌తో మంచి అనుబంధం ఉంది. ఆ సంస్థ వల్లే 2డీ ఎంటర్‌టైన్‌మెంట్స్, డ్రీమ్ వారియర్ పిక్చర్స్ ప్రారంభించగలిగా. నా సోదరుడు కార్తిని సినిమాల్లోకి పరిచయం చేసిన వ్యక్తి జ్ఞానవేల్'' అని తెలిపారు. తన తోటి నటులు, ప్రస్తుతం రాజకీయాల్లో బిజీగా ఉన్న ఉదయనిధి స్టాలిన్, విజయ్‌కు ఆయన అభినందనలు చెప్పారు. వారిద్దరూ మరెన్నో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని కోరారు. ఇదే కార్యక్రమంలో పాల్గొన్న కార్తి.. సూర్య గురించి మాట్లాడారు. ''డ్యాన్స్ రాదన్నారు. ఫైట్స్ రావు అన్నారు. మంచి బాడీ లేదన్నారు. ఇప్పుడు ఫైటర్‌లా సిద్ధమయ్యాడు. ఈ సినిమా కోసం సూర్య ఎంతో కష్టపడ్డాడు'' అని అన్నారు. 'ఖైదీ 2'లో సూర్య కూడా భాగమేనన్నారు. దీని చిత్రీకరణ వచ్చే ఏడాది నుంచి ప్రారంభం కానుందని చెప్పారు. 'కంగువా' విజయం సాధించాలని కోరుకుంటూ అగ్ర కథానాయకుడు రజనీకాంత్ వీడియో సందేశం పంపించారు. ''ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించారు. 'కూలీ' షూట్ కారణంగా నేను రాలేకపోయా.

దర్శకుడు శివ గతంలో నాతో వర్క్ చేశారు. పీరియాడికల్ స్టోరీ ఏదైనా చేద్దామని తరచూ చెబుతుండేవాడిని. నాకు తెలిసి 'కంగువా' కథ నా కోసమే రాసి ఉంటారు (నవ్వులు). చివరకు అది సూర్య, గ్రీన్ స్టూడియోస్ వద్దకు చేరింది. ట్రైలర్ అద్భుతంగా ఉంది. సూర్య గొప్ప నటుడు. తన పాత్ర కోసం ఎంతో కష్టపడుతుంటాడు. ఈ సినిమా ఘన విజయాన్ని అందుకోవాలని కోరుకుంటున్నా'' అని చెప్పారు.



## చనిపోయినట్లు అప్పట్లో వార్తలు....

బాలీవుడ్ నటి కాజోల్) కీలక పాత్రలో నటించిన సరికొత్త చిత్రం 'దో పత్తి'. శుక్రవారం ఇది నెట్‌ఫ్లిక్స్ వేదికగా విడుదలై మంచి టాక్ సొంతం చేసుకుంది. దీని ప్రమోషన్స్‌లో భాగంగా చిత్రబృందం తాజాగా 'ది కపిల్ శర్మ షో'లో సందడి చేసింది. ఈ సందర్భంగా కాజోల్ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. తాను చనిపోయినట్లు చాలా సందర్భాల్లో వార్తలు వచ్చాయని.. వాటిని చూసి షాకయ్యానని చెప్పారు.

మీ గురించి మీరు చదివిన వింత వార్తలు ఏమైనా ఉన్నాయా? అని ప్రశ్నించగా.. ''చాలా ఉన్నాయి. ఏకంగా నేను చనిపోయినట్లు వార్తలు వచ్చాయి. వాటిని చూసి షాకయ్యా. ఇలా ఎన్నోసార్లు జరిగింది. దాదాపు ఐదేళ్లకొకసారి ఇలాంటివి వస్తుంటాయి. ఇంటర్నెట్ లేని రోజుల్లో గుర్తు తెలియని వ్యక్తి మా అమ్మకు ఫోన్ చేసి.. విమాన ప్రమాదంలో నేను చనిపోయానని చెప్పాడు. ఇంట్లోవాళ్లు కంగారుపడ్డారు. ఇటీవల యూట్యూబ్‌లో నేను మృతి చెందినట్లు వార్తలు కనిపించాయి. నా గురించి ఎలాంటి వార్తలు వచ్చాయి? ఎవరు ఎలా మాట్లాడుకుంటున్నారు? అని గూగుల్ చేయను. నాపై ఏదైనా సంచలన కథనాలు వస్తే.. స్నేహితులు నాకు పంపిస్తుంటారు. వాటిని చదివినప్పుడు ఇలా ఎలా రాస్తారు? అనిపిస్తుంది'' అని కాజోల్ తెలిపారు.
కృతిసనన్ ప్రధాన పాత్రలో నటించిన చిత్రమే 'దో పత్తి'. ఇందులో ఆమె ద్విపాత్రాభినయం చేశారు. మిస్టరీ థ్రిల్లర్ నేపథ్యంలో రూపొందిన చిత్రమిది. శశాంక చతుర్వేది దర్శకత్వం వహించారు. కవలలైన అక్కా చెల్లెళ్ల రహస్యాలను వెలికితీసే పోలీసు అధికారి పాత్రలో కాజోల్ నటించారు. 'బ్లూ బటర్ ఫ్లై ఫిల్మ్స్' పతాకం పై కృతి నిర్మించిన తొలి చిత్రమిది. షహీర్ షేక్, తన్వీ అజ్మీ, బ్రిజేంద్ర కాలా కీలక పాత్రలు పోషించారు. నెట్‌ఫ్లిక్స్ వేదికగా అక్టోబర్ 25న దీనిని విడుదల చేశారు.



printed& Published &edited by Chandra shekar vippala, from Adhya publications, hyderabad, phone no... 9951121243 (Trial version)